నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక 27 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | జూలై 26, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

నాటినట్టి మొక్క నాకిచ్చు పళ్ళన్ని
తీయదనము తోడ హాయినొసగు
కష్టపడగ వచ్చు కమనీయ ఫలితంబు
అంతులేని యట్టి సంతసంబు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు
తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.


# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

● అప్పడే యువతకు రాజకీయ అవకాశాలు వస్తాయి ● తెలంగాణ అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేస్తాం ● కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిఎం రేవంత్



హైదరాబాద్,జులై 25 : చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే నీతిమంతమైన రాజకీయాలు సాగుతాయని అన్నారు. దేశంలో అధికారంలో వారు భాగస్వాములు కావాల్సి

మిగతా2లో...



## పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం: బండి

హైదరాబాద్,జులై 25 : 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. ' ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని

మిగతా2లో...



## అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

- ధర్మేంద్ర రాజీనామాపై కెటిఆర్ పోస్ట్

హైదరాబాద్,జులై 25 : యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజేపీ కాంక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజేపీ ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం

మిగతా2లో...

## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

- ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం



2లో

## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

● గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం ● ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే



2లో

## జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

- కేంద్రమంత్రులతో సిజెపి ప్రతినిధుల చర్చలు ఫలప్రదం
- విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం
- భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ
- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్



న్యూఢిల్లీ,జులై 25 : జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర

మిగతా2లో...

## విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

● కేంద్రం దిగిరాక తప్పని పరిస్థితి ● మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం
● కేంద్రం తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్,జులై 25 : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా

మిగతా2లో...

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

- ●రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి
- ●త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు
- ●రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత
- ●రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్,జులై 25 : రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశ పూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండు న్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని ,

మిగతా2లో...



## ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

●డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి ●మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్,జులై 25 : ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు.

మిగతా2లో...

## రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సమస్య రాకూడదు

● మిషన్ భగీరథ ద్వారా ముందస్తు చర్యలు తీసుకోవాలి ● 15 రోజులకోమారు స్వయంగా సమీక్ష చేపడతా ● అధికారులను ఆదేశించిన మంత్రి



2లో

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక




# జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం దిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.

దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం‘ అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు.

# చట్టసభల వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పోరాటం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే తొలగించాలని, వారి విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలంతా ఇదే నినాదాన్ని వినిపించాలని సూచించారు. విద్యార్థుల పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారని, ఇది యువత సాధించిన విజయమని అన్నారు. విద్యార్థుల మొహాల్లో కనిపిస్తున్న ఆనందమే అసలైన విజయమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చప్పన్ ఇంచ్ ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకునే నాయకత్వం.. దేశ యువత ముందు ఓడిపోయిందని విమర్శించారు. అయితే విద్యార్థులపై నమోదైన కేసులు ఇంకా తొలగించలేదని, వెంటనే వాటిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించలేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకూ వారి తరఫున కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం మెడలు వంచినందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

40 శాతం వరకు ఎలాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంత మంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్దంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక త్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷–లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15–20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2–3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

(మొదటి పేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్ర మాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

# విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గ్దదె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన పదవి కాపాడుకోవడానికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. నీట్ పరీక్ష లీక్ జరిగినప్పుడే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చేదే కాదన్నారు. మూడు నెలల పాటు ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించిన ఆయన.. విద్యార్థులపై పెరిగిన ఒత్తిడి, నిరసనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. యువత తమ దమ్ము ఏంటో నిరూపించారని, వారి పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో పేపర్ లీకులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు.

# ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

**● ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం**

**న్యూఢిల్లీ,జులై 25 :** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్స్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

# ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

**న్యూఢిల్లీ,జులై 25 :** నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

# పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం: బండి

(మొదటి పేజీ తరువాయి)

కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు‘ అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# అధికారంలో ఉన్నవారి కంటే ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

(మొదటి పేజీ తరువాయి)

సీజేపీ నేతలను చర్చలకు కూడా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పది. జెన్ జి ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహానగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారని తెలిసిందే. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై భావోద్వేగంతో ప్రసంగించారు. 'పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు? ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?' అని కేంద్రాన్ని నిలదీశారు. ఢిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. ఢిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.

# రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సమస్య రాకూడదు

**● మిషన్ భగీరథ ద్వారా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**● 15 రోజులకోమారు స్వయంగా సమీక్ష చేపడతా**

**● అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్,జులై 25 :** దేశవ్యాప్తంగా ఎల్ నీనో పరిస్థితులు నెలకొన్నాయని, ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై కూడా ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాబోయే వేసవి పరిస్థితులు , నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించా రు. రాబోయే వంద రోజుల పాటు రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, నీటి సరఫరాపై ప్రతి 15 రోజులకు ఒకసారి తాను స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. విధుల పట్ల అశ్రద్ధ లేదా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ కూడా ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. గ్రామాల్లో ఎక్కడైనా అత్యవసరంగా తాగునీటి సమస్య తలెత్తితే 16వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక నీటి వనరులను మరింత మెరుగుపరచాలని, నిరుపయోగంగా ఉన్న బోర్వెల్స్‌కు వెంటనే మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలున్న గ్రామాలను గుర్తించి, వారం రోజుల్లోగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. మండలాల వారీగా అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని, ఎక్కడా సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఏదైనా పైప్‌లైన్ లీకేజీలు లేదా రిపేర్ల కారణంగా ఒక రోజు నీటి సరఫరా నిలిచిపోతే, ఆ విషయాన్ని గ్రామస్తులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. దీనివల్ల ప్రజలు ముందస్తుగా నీటిని నిల్వ చేసుకుని సిద్ధంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఎల్ నీనో తీవ్రత దృష్ట్యా మిషన్ భగీరథ ఇంజనీర్లు , అసిస్టెంట్ ఇంజనీర్లు మరింత జవాబుదారీతనంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మిషన్ భగీరథతో ఇంకా అనుసంధానం కాని ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో ఏఈలు స్వయంగా పర్యటించి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని సీతక్క ఆదేశించారు. ప్రతి మండలంలో ఏఈలు స్థానిక సర్పంచ్‌లతో సమావేశమై మంచినీటి సరఫరా తీరుపై సమీక్షించాలని చెప్పారు. గతంలో కూడా ఎల్ నీనో పరిస్థితులు ఉన్నప్పటికీ సమర్థవంతంగా పనిచేసి నీటి ఎద్దడి లేకుండా చూశామని, ఇప్పుడు కూడా అదే పట్టుదలతో పనిచేయాలని కోరారు. 'జలసిరి' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ వర్షపు నీటిలోని ప్రతి బొట్టునూ ఒడిసిపడితే భవిష్యత్తులో ఇలాంటి తాగునీటి సమస్యలను శాశ్వతంగా అధిగమించవచ్చని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

RNI - TELTEL/2023/87644

# నీలగిరి సాహితీ సంగమం -15

## చాటువులు

కం
తమవైరి నెవరు పొగడిన
ప్రమదింపగ లేరు జనులు వసుధను జూడన్
తమకేమని భావింపక
తమ గొప్పలె పలుకుచుంద్రు తమకము లోనన్
కం
ఉత్తము గలువంబోవగ
నత్తరు నమ్మెడి దుకాణ  మరగిన యట్లే
యత్తరు కొనకనె యంటెడి
మత్త సుగంధమును బోలు మహిగుణమంటున్
కం
విడివడి బండలు దొరలును
దడదడ మనుచున్, తలమును తాకియు నాగున్
నడిగెడి విపన్నుల్ గాచెడి
వడగును పరమేశు డొకఁడె పాటింపజనున్

**సత్యనారాయణ బొలిశెట్టి,**
**హైదరాబాద్**

## కం!!

అలుపెరుగని యిల్లాలును
విలువలు బోధించునట్టి విజ్ఞులనైనన్
పిలిచిన పలికెడి హితులను
తలవంచని సైనికులను దలచుము కృష్ణా!!

వేకువ జామున పేపరు
టీకప్పును చేతబూని టెక్కును జూపన్

మేకప్పును వేసుకొనియు
కాకము వలె పొడిచి చంపు క్యాన్సరు కృష్ణా!!

**గడ్డం కృష్ణారెడ్డి రేపాల సూర్యాపేట!!**

## వరాహావతారము

తే.గీ.
అఖిలలోక కంటకుడయి హానిచేయు
అసురుడా హిరణ్యాక్షుని నణిచివేయ
హరియె
నవతారమెత్తెనీయవనియందు
దుష్టశిక్షణ సేయగ దునిమెనాడు

తే.గీ.
నిశిత దంతాగ్రకోరలు నిలిపి వడిగ
భీక రావతారంబున భీతిగొల్ప
దైత్యగుండెల గుచ్చెను దానవారి
విడిచె ప్రాణంబులటదాన
వీరుడపుడు

తే.గీ
కోరలపయి నిల్పిధరను కూర్మిమీర
వసుధమాతను రక్షించె
వకుళసుతుడు
ఘనుడు యజ్ఞవరాహమున్ గాంచి
నపుడు
స్తోత్రములు జేసె మేటిగ సురలుజేరి

**మాతా గంగాభవాని శాంకరీ దేవి,చెన్నై.**

## “ కృష్ణా “

కందములు
అక్కజమౌ కలరూపము
చొక్కపు నగవుల నలరెడి సొగసుల
హేలల్
మక్కువ బెంచుచు మనసున
నిక్కము నీదరి నిలుపును నెలమిని
కృష్ణా !
నల్లని వేల్పువు నీవై
చల్లని దంద్రివి జగతికి సారస
నయనా
వల్లవ గృహముల వెన్నలు
కొల్లగొనుచు పాపములను గూల్చిన
కృష్ణా !
ఛందో బ్రహ్మము నీవై
బృందావన వాటికలను బృందము
తోడన్
నంద కుమారుడవుగ నీ
కందువ లీలలు విదితమె గాదిలి
కృష్ణా !

**శ్రీమతి టి. లక్ష్మీకృష్ణ**
**హైదరాబాద్**

## వాన

వాన ఆగినది
రైతు మోము వాడినది
వసుధ ఎండినది
వరి సాగు ఎదగను లేదు
వాన వచ్చునని మురిసి
నాటితి పూల మొక్కలు
నాటుకొనను లేదు మొక్కలు
నారు ఎండి పోవునేమో
పిల్లలు సంబరంగా తీసిరి
రంగురంగుల గొడుగులు
హంగులన్ని ఆగిపోయే
వరుణదేవు అలిగిపోయే

**శర్వాణి పాతూరి**

## అలక

సీ.:

ఆలుమగల మధ్య ననురాగ వృద్ధికి
నాలవాలమగుచు 'నలక'
లుండు,

కోరికలను దెల్పి గుంభనముగ సతి
గుర్తించని పతిపై కోపగించు,

వేడుకోలున పతి ప్రేమకగు పరీక్ష,
మన్నించుటల సతి
మంచితనము,

శృంగార రీతిగ చిర పరిచితమౌచు
పౌరాణిక కథల వర్ణనలను.
తే.గీ. :

ఏడు జన్మల కని సాగు తోడునీడ
దంపతుల మధ్య బంధము
దైవికంబు,

బ్రతుకు బాటలోని వెతల
గతుకులందు

ప్రక్రియగ 'నలక'ను ప్రేమ
ప్రముఖమగును.

**వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు**

## విద్యా ధనము

ఆటవెలదులు
పాఠశాల యందు పాఠ్య బోధన
చేయ
వచ్చి చేరునయ్య వాసితముగ
గురువు యందు నిల్పు గురుతర
భక్తిని
నేర్చుకొనుము నీవు నేర్పు తోడ.
సంశయములఁ దీర్చు
సంతోషకరముగా
విద్య నేర్పుచుండు వృద్ధి చెందఁ
భావి జీవితముకు బంగారు బాటలు
వేయు విద్య నీకు విలసితముగ.
కలిమి లెంతయున్నఁ గలుగునంత
సుఖము
విద్య తోడున్న వెలుగు బ్రతుకు
విద్య మరియు ధనము
విలువలన్బెంచును
తగీన విధము వాడు తనివి తీర.

**కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ,**
**ధర్మపురి.**

## జగన్నాథస్వామీ!

మ.
బలభద్రానుజ!వాసుదేవ
!మహితా!భవ్యార్థసంధాయకా
కలతల్ బాపుచు మొండిజగ్గడివిగా
కల్యాణసత్కాంక్షివై
చెలిమిన్ సోదరి కూడి యాత్రికిలలో
శ్రీనందిఘోషమ్ముపై
వెలిగే దైవమ!మంగళమ్ములివియే
వేద్యా!జగన్నాథుడా!
శా.
పూరీపట్టణవాస
పుణ్యచరితా!భోసుందరాంగా విభూ!
భేరీనాదముపిక్కటిల్లదెసలన్ ప్రీతిం
జగాలేలుచున్
స్వారీజేయుచు నందిఘోష రథమున్
వైమానవేగంబుతో
నారీరత్నము సోదరుండు జనిరా
నారాయణుండొచ్చెడిన్.

**అవధానిని.గాయత్రీదేవి**

## నేటి లోక స్థితి

తే.గీ.
మంచి తనమున కర్థము మారి
పోయె
కాసు లేక కాగితమైన కదలదిపుడు
ధనము ముఖ్య మాయెను 'రామ'
ధరణి యందు
నేటి లోక రీతిది యేను
నీరజాక్ష!????

తే.గీ.
పలుకుదురు నీతి పలుకులు బాగు
గాను
చేసెడి పనుల లేదుగ చిత్త శుద్ధి
అక్ర మార్జనయే ధ్యేయ మాయె
నేడు!
నేటి లోక రీతిది యేను
నీరజాక్ష!????

**వసుమతీ జగన్నాథం.**
**హైదరాబాద్.**

## గోరింటాకు

ఆటవెలదులు

కొమ్మ కొమ్మలోన గోరింట
యందాలు
కోయుచుండిరాకు కొసరి కొసరి
అతివలెల్ల కలసి యాషాఢ మాసాన
కోర్కెలన్ని యెదన కొలువుదీరె

కోసినాకునంత కోమలాంగులు దెచ్చి
రోటవేసి మిగుల రుబ్బిరంట
పండెనపుడు చేయి!వర్ణించ
తరమెట్లు?
ఎరుపు రంగులోన మెరుపులీనె

మంచి మొగుని కొరకు మందార
రంగులో
పండినంత మురిసె పడతి చాల
చిట్టి చేయి మెరిసె సిందూర వర్ణాన
సిగ్గుమొగ్గలయ్యె చిన్నదపుడు

**వరలక్ష్మి యనమంద్ర**
**హైదరాబాద్**

## ప్రపంచీకరణ

ప్రపంచీకరణ .... ప్రపంచ వాణిజ్య సౌకర్యాల ఆకర్షణీయత
దేశ-విదేశాల సంస్కృతి-సంప్రదాయాల కలబోత
ఆర్థికాభివృద్ధికై అమ్ముడుపోతున్న మానవీయత
అంతర్జాతీయ వెలుగుజిలుగులకు..
మాయమవుతున్న నైతికత
భారతీయ సహజాభరణాల (ఆత్మాభిమానం-ధృఢమైన వ్యక్తిత్వం)
విలీనానికి నిర్విరామ కృషిసల్పుతున్న జాతీయత
అనాగరికతకు స్వాగతం పలుకుతున్న అధునాతన(అశ్లీల -వేషధారణ) సాంకేతికత
శాస్త్రసాంకేతికాభివృద్ధికి సోపానమార్గం
మానవ సంబంధాల - విరక్తిభావాల
నిజరూప దర్పణం...ప్రపంచీకరణం....

**నల్ల రాజేశ్వరి, కరీంనగర్**

## భద్రాచల మాహాత్మ్యం

సీసం:
రామరామ యనిన రక్షించు వాడవు
నీవుకాక యెవరు నీరజాక్ష!
అసుర కాకికి నీవు అభయమ్ము నిచ్చావు
కరుణాలవాలవు కమలనయన!
అటులైన తాటకి నెటుల చంపితివోయి?
నిజము చెప్పుచు దాని నిగ్గు తేల్చి!
పాహిపాహి యనిన పాషాణమునకీవు
దేహ మొసగినావు దేవ దేవ!!
ఆ. వె:శబరి యెంగిలి తిని చక్కగా దీవించి
చింత దీర్చినావు చిత్రముగను!
రామ దాసు నేల రచ్చకీడ్చితివేల?
భద్రగిరి నివాస భవ్య చరిత!!

**డా. యర్ర హరికిషన్, తుంగతుర్తి**

## నేటి నాయకులు

తే.గీ.

ప్రజల నమ్మకమున గెల్చి పదవి పొంది
కష్ట సుఖములు జనులకు గాంచ కెపుడు
విత్త మార్జింప నేతలు వేగ పడుచు
దోచుకొందురు చేతికి దొరికినంత...
తే.గీ.
ప్రతినిధులగుచు నేతలు బాధ్యతలను
సల్పవలయును ప్రజలకు సాయ పడుచు
హితపు కార్యములు విజయ హేతువగుచు
నాయకుల యందు కలిగించు నమ్మకమును
తే.గీ.
ప్రజల క్షేమము కోసము పాటుబడుచు
పదవి యనునది ఒక బాధ్యతయని
సేవ లక్ష్యమని దలచి జేసి నంత
జనులు నేతల కొనియాడు జగతి యందు.

**మరింగంటి శ్రీనివాస్**
**హైదరాబాదు**

## పోలిక - చాలిక!

చంపకమాల:
పురుషుల స్త్రీల నేవిధిని బోల్చుట యుక్తము గాదు సృష్టిలో
నిరువురి పాత్ర వేరుగతి నేర్పడ జేసెను బ్రహ్మ నేర్పుతో
తరతమ భేద భావనల దప్పుల నెంచక జంట లొక్కటై
కరములు వట్టి సాగుచు సుకార్యములన్ సలుపంగ ధర్మమౌ!
కందము:
పోలిక పోటీ వద్దిక
చాలిక గొడవలు మనుడిక సఖ్యతతోడన్! స్త్రీలును పురుషులు నిరువురు
మేలగు పోషించ విధులు మిత్రత తోడన్!
మత్తకోకిల:
శక్తి సాయము లేక ఈశుడు సాగ లేడుగ ముందుకున్
శక్తి నిచ్చెడి భర్త సాయము సాధ్వి కుర్విని క్షేమమౌ
యుక్తమౌ గద భార్య, భర్తలు నోర్పుతోడ వసించగా!
తిక్తమౌ బ్రతుకెల్లరిర్వురు ద్వేష భావముతో మనన్!

**కుసుమ ఉప్పలపాటి**

## ఆషాడ మాసపు గోరింట

చేతిఎరుపు నీ వలపుగ పండుతోంది గోరింట
సంప్రదాయ ఆనవాళ్ళు నింపుతోంది గోరింట!
మనసులోని ఆనందము  అరచేతిన అతివలకు
అందమైన కలిమి చెలిమి పంచుతోంది గోరింట!
శుభకార్యపు ముంగిట్లో తారాడే  ముచ్చట్లే
అనురాగపు బంధాన్నే కలుపుతోంది గోరింట!
పచ్చనాకు  కరముచేరి ఎర్రబారి కులికింది
అట్లతద్దె పండుగందు ఆడుతోంది గోరింట!
అమ్మ ప్రేమ చుక్కలుగా అద్దగానె చేతులకు
చిన్నతనపు జ్ఞాపకాలు తలుస్తోంది గోరింట!
వన్నెలెన్నొ పాదాలకు దిద్దగానె పండెనోయి
గిలిగింతల పారాణిగ మెరుస్తోంది గోరింట!
సౌభాగ్యం ఆరోగ్యం ఇంతులకే ఆనందం
ముచ్చట్లను పంచుకుంటు వెలుగుతోంది గోరింట!

**కానుకొలను లక్ష్మీసీత**
**హైదరాబాద్**

## కాలం

గిర్రున తిరిగేది కాలం జర్రున జారుకొనేదీ కాలం
అర్రులు చాచిన ఆగనిది కాలం
అంతుచిక్కని అతి పెద్ద రహస్యమే కాలం
ఆచితూచి వ్యవహరించినా దాగనిది కాలం
ఆగ్రహం వ్యక్తం చేసినా ససేమిరా అనేది కాలం
మన వయసును నిర్ణయించేది కూడా కాలం ఎంతటివారికైనా కాస్త ఎక్కువ తక్కువ అదే కాలం
సద్వినియోగం చేసుకోవాలని సంకల్పానికి తెచ్చేది కాలం
కాలానుగుణంగా మార్పులు చేర్పులు జరిగినా
తనపని తాను చేసుకొనేది కాలం కాలస్వరూపుని మనసారా ఆహ్వానం పలుకుతూ
ఆనందాలు పంచుకుందాం కాలానికి సమస్యలు అప్పచెప్పి నిండు మనసుతో
స్వాగతం పలకడమే అంతరార్థం
కలకాలం వర్ధిల్లే నీవే దైవం కాలదేవా! సాష్టాంగ ప్రణామం

**శశిశేఖర్ అల్లంకి ఏలూరు**

## మంత్రి అడ్లూరికి కీలక బాధ్యతలు



**జగిత్యాల, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ప్రభుత్వం రెండు కీలక కమిటీలలో సభ్యునిగా నియమించింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను పరిశీలించే ఉన్నతస్థాయి కమిటీలో ఆయనకు స్థానం కల్పించారు. అలాగే ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షను నిరోధించే లక్ష్యంతో రూపొందిస్తున్న రోహిత్ వేముల బిల్లుపై సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలోనూ సభ్యత్వం ఇచ్చారు. మంత్రి అడ్లూరి మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ కమిటీలలో తన పాత్ర సామాజిక న్యాయం సాధనలో కీలకమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టే దిశగా మరో ముందడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## వివాహిత ప్రాణాన్ని కాపాడిన పోలీసులు



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన దుర్శేడు గ్రామానికి చెందిన నేతి మానసను రూరల్ పోలీసులు సకాలంలో స్పందించి ప్రాణాన్ని కాపాడారు. సమాచారం అందుకున్న వెంటనే ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి బ్లూ కోల్ట్ సిబ్బంది పీసీ అఫ్జల్, హోంగార్డ్ ప్రసాద్‌ను సంఘటనా స్థలానికి పంపించారు. వారు మహిళను నిప్పంటించుకోకుండా అడ్డుకుని కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో స్పందించి ఒక మహిళ ప్రాణాన్ని కాపాడినందుకు ఏసీపీ విజయ్ కుమార్, కమిషనర్ గౌష్ ఆలం పోలీసులు అభినందించారు. ప్రజలు సమస్యలు ఎదురైనప్పుడు ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకుండా కుటుంబ సభ్యులు లేదా పోలీసులను సంప్రదించాలని రూరల్ పోలీసులు సూచించారు.

## దోమల నివారణకై ఫాగింగ్ స్ప్రే కార్యక్రమం



**ఖానాపూర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు నివారించేందుకు ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డులలో దోమల ఫాగింగ్ (స్ప్రే కార్యక్రమం ప్రారంభమైంది. మున్సిపాలిటీ సిబ్బంది చేత పిచికారి పనులు ఒకటో వార్డులో ప్రారంభమై, మొత్తం 12 వార్డులలో రోజువారీగా కొనసాగనున్నాయని చైర్మన్ తెలిపారు. ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్ మంజూరు చేయాలని వినతి



**ఖానాపూర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేసవి కాలంలో సెన్సస్--2026 విధులు నిర్వహించిన జిల్లా ఉపాధ్యాయులకు ఈఎల్ఎస్ మంజూరు చేయాలని కోరుతూ ఎస్టియుటిఎస్ నిర్మల్ జిల్లా శాఖ శనివారం జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్నకు వినతిపత్రం సమర్పించింది. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి బి. వెంకటేశ్వర్ రావు, సారంగపూర్, లక్ష్మణచాంద మండల అధ్యక్షులు మఠం పరమేశ్వర్, పి. నగేష్, నిర్మల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఖలిద్ అహ్మద్ పాల్గొన్నారు. ఉపాధ్యాయుల హక్కులను కాపాడే దిశగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సూపరింటెండెంట్ డాక్టర్ స్వర్ణ రెడ్డికి ప్రభుత్వ టీచర్లచే ఘన సన్మానం



**ఖానాపూర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ స్వర్ణ రెడ్డిని పట్టణానికి చెందిన ప్రభుత్వ టీచర్లు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, మొక్కను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత వాల్గోట్ కిషన్, కె. భూమేశ్వర్, ఏ. రవీందర్ గౌడ్, సి. వెంకట్ రాములు, గంగన్న పాల్గొన్నారు. టీచర్లు డాక్టర్ స్వర్ణ రెడ్డి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



**ఖానాపూర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తొలి ఏకాదశి సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం, మహాదేవుని ఆలయం, వీరాంజనేయ స్వామి ఆలయం, జంగల్ హనుమాన్ ఆలయం సహా మండలంలోని పలు గ్రామాల శివ, వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు ఉదయం గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించి, ఉపవాసాలు పాటిస్తూ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో శ్రీకృష్ణుడు, గోదాదేవి, లక్ష్మీదేవికి విశేష అర్చనలు, విష్ణు సహస్రనామ పారాయణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకల్లో ప్రధాన అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి ఉత్సవాలు



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కోర్ట్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, ఏకలవ్యుడు స్వాభిమానం, సంకల్పం, గురుభక్తికి ప్రతీకగా నిలిచాడని, తన స్వయంకృషితో విలువిద్యలో అపూర్వ నైపుణ్యం సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడని పేర్కొన్నారు. ప్రతిభకు కులం, వర్గం, ఆర్థిక స్థితి అడ్డంకులు కావని ఆయన జీవితం చెబుతోందని, యువత ఏకలవ్యుడి స్ఫూర్తితో విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఆదివాసి, ఎరుకల వర్గాలు ఇంకా వెనుకబడి ఉన్నాయని, వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రక్షణ సేన కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, బీసీ విభాగం అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, చెన్నమల్ల చైతన్య, కుతాడి రజిత, చంటి శ్రీనివాస్, మడిపల్లి వినిత్, జంగా అపర్ణ సాగర్, దాసరి శైలజ, పల్లె శారద, లింగంపల్లి శ్రీనివాస్, నగునూరి రమేష్, సమీరా, కౌశిక్, సుమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీలకు న్యాయం చేయాలి అబ్దుల్ రహేమాన్




**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముస్లిం మైనారిటీ కాంగ్రెస్ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని మాజీ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహేమాన్ డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, గత 35 సంవత్సరాలుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ముస్లిం నాయకులకు ఇప్పటివరకు నామినేటెడ్ పదవులు దక్కకపోవడం బాధాకరమని అన్నారు. కరీంనగర్ అసెంబ్లీలో 70 వేల మంది ముస్లిం ఓటర్లు ఉన్నప్పటికీ వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీని కన్నతల్లిలా భావించి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పనిచేశామని, ఇతర పార్టీల ఆహ్వానాలను తిరస్కరించామని తెలిపారు. తమ సేవలను గుర్తించి సుడా, లైబ్రరీ, మార్కెట్ కమిటీ లేదా రాష్ట్ర కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే, ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణను కోరారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజొద్దీన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహేమత్ హుస్సేన్, సీనియర్ నాయకులు నేహాల్ అహ్మద్, ఎండీ చాంద్, ఎండీ కలీమొద్దీన్, కమరొద్దీన్, ఇమ్రాన్, అమీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే




**ఓదెల, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓదెల మండల కేంద్రంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జలసిరి పోస్టర్‌ను ఆవిష్కరించి, 46 మంది లబ్ధిదారులకు రూ.46.30 లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు వరి బదులుగా కందులు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఆయిల్‌పామ్, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరి సాగు చేస్తే నష్టాలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం పునఃసర్వే చేపడుతున్నామని, ఇప్పటికే 23 గ్రామాల్లో ప్రారంభమైందని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా అందిస్తున్నామని, ఇటీవల రూ.9 వేల కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. వరి కొనుగోళ్లలో క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, విద్యా శాఖ, ఆసుపత్రి అభివృద్ధి పనులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీరాములు, తహసీల్దార్ వనజ, ఎంపీడీవో అనిల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట విజయం

**కరీంనగర్/హుస్నాబాద్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమానికి దక్కిన చారిత్రక విజయమని కాంగ్రెస్, సిపిఎం నాయకులు పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నబోయిన విద్యాసాగర్ యాదవ్ మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్ల కోసం లాఠీచార్జీలు, నిర్బంధాలను ఎదుర్కొంటూ పోరాడిన విద్యార్థుల ధైర్యసాహసాలకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించి విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. క రీంనగర్‌లో జరిగిన సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ ఘటనలో బాధ్యత వహిస్తూ ప్రధాన్ రాజీనామా చేయడం శుభపరిణామమని అన్నారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి, కొత్త విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. విద్యార్థుల ఐక్య పోరాటం కేంద్ర ప్రభుత్వాన్ని తలవంచేలా చేసిందని, ప్రజాస్వామ్య స్వరాలను అణచివేయలేమని నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.




## ప్రజాగ్రహానికి ఎవరైనా తల వంచాల్సిందే బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్



**కల్వకుర్తి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంలో విద్యాశాఖ వైఫల్యం స్పష్టమైందని, విద్యార్థుల విజయం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర సింగ్ ప్రధాన్ రాజీనామాలో ప్రతిఫలించిందని బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటింది. వాంగ్ చుక్ దీక్ష, కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళన విషయంలో కేంద్రం అనుసరించిన వైఖరి సమంజసం కాదు. విద్యార్థులపై అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించింది. అందుకే యావత్ దేశం మోడీ ప్రభుత్వంపై తిరగబడే పరిస్థితి వచ్చింది. ప్రజాగ్రహాన్ని గ్రహించిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది" అని పేర్కొన్నారు. అనేక మంది విద్యార్థులు నష్టపోయిన తర్వాత రాజీనామా చేయించడం, రైతులు మరణించిన తర్వాత సాగు చట్టాలను రద్దు చేసినట్లే ఆలస్యంగా తీసుకున్న నిర్ణయమని ఆయన విమర్శించారు. నీట్ వంటి జాతీయ పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించాలని, డిజిటల్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు హైజాక్ చేయడం వల్ల సమస్య పక్కదారి పడుతుందని హెచ్చరిస్తూ, ప్రభుత్వంలో ఉన్న వారు తామే అధికులమనే వైఖరిని విడనాడాలని గణేష్ అన్నారు. హామీల అమలు విషయంలోనే కాకుండా అనేక అంశాల్లో వైఫల్యం చెందిన రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజా రాజకీయ పరిణామాలతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా క్లస్టర్ కబడ్డీ టోర్నమెంట్‌కు శ్రీకారం



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీబీఎస్ఈ క్లస్టర్--ఎ×× బాలురు, బాలికల కబడ్డీ టోర్నమెంట్‌కు కరీంనగర్‌లో ఘనంగా శ్రీకారం చుట్టారు. వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 160 జట్లు, సుమారు 1,400 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు విజేతలు, రన్నరప్ జట్లకు రూ.1 లక్ష నగదు పారితోషికం అందజేస్తానని ప్రకటించారు. కబడ్డీ క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించే గొప్ప క్రీడ అని ఆయన పేర్కొన్నారు. సీబీఎస్ఈ రీజినల్ ఆఫీసర్ జంగం సునీల్ కుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డా. చెన్నాడి అమిత్ కుమార్ విద్యార్థులకు క్రీడాస్ఫూర్తి, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. జూలై 25 నుంచి 27 వరకు జరిగే ఈ పోటీల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, కోచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యమని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు తెలిపారు .శనివారం కొత్తపల్లి ప్రజా కార్యాలయంలో బావుపేట, ఆసిఫ్‌నగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తపల్లి మండల దూదేకుల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ హసన్, ఎండి నయీమొద్దీన్, ఎండి జావేద్, ఎండి రఫీక్, ఎండి అమీర్, రావణవేణి తిరుపతి తదితరులు చేరగా రాజేందర్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి మరింత ఆదరణ తీసుకురావాలని, ప్రజల విశ్వాసమే కాంగ్రెస్ బలం అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది కాంగ్రెస్‌లో చేరతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎలగందుల సర్పంచ్ నిమ్మల అంజన్న, ఉపసర్పంచ్ గసికంటి కుమార్, ఏఎంసీ డైరెక్టర్ రావణవేణి సంపత్, మాజీ ఎంపీటీసీ బోనాల కనకయ్య, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం





**హుస్నాబాద్/కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన ఉద్యమ విజయమని బీఆర్ఎస్ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద దాదాపు 20 రోజుల పాటు విద్యార్థులు ఎలాంటి పార్టీ జెండా లేకుండా పోరాటం సాగించారని, వారి ఐక్యత, పట్టుదల ముందు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ కారణంగా 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ, విద్యార్థుల పోరాటం దేశ చరిత్రలో గర్వించదగ్గదని, ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం, యువత విజయం అని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన విద్యా వ్యవస్థ దెబ్బతింటోందని, నీట్ లీకేజీకి కారణమైన వారిని ఎంత పెద్దవారైనా శిక్షించాలన్నారు. ఈ ఉద్యమం దేశ యువత శక్తిని ప్రతిబింబించిందని, ఇకపై విద్యార్థుల హక్కుల కోసం మరింత బలంగా పోరాడతామని నాయకులు స్పష్టం చేశారు.

## అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఏఐఎఫ్బి డిమాండ్



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీతారాంపూర్ శివారులోని మేలకుంట శిఖం ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతలు డిమాండ్ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన వారు, ఇరిగేషన్ శాఖ నుండి ఎన్ఓసీ లేకపోయినా నగరపాలక సంస్థ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారో ప్రశ్నించారు. గతంలో సర్వేయర్ బృందం నివేదికలోనే 40 మందికి పైగా అక్రమార్కులు ఇక్కడ నిర్మాణాలు చేపట్టినట్లు స్పష్టమైందని గుర్తుచేశారు. అక్రమ కట్టడాల వల్ల స్వల్ప వర్షానికే సూర్యనగర్ కాలనీ, ఆర్టీసి వర్క్‌షాప్ పరిసరాలు జలమయమవుతున్నా యని, ప్రధాన రహదారిపై వాహనాలను తరచూ మళ్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మేలకుంట శిఖంలో జరుగుతున్న అపార్ట్మెంట్లు, ఇతర నిర్మాణాలను నిలిపివేసి, అక్రమ కట్టడాలను కూల్చి ప్రభుత్వ భూమిని కాపాడాలని నేతలు డిమాండ్ చేశారు.

## శాతవాహన యూనివర్సిటీ అసోసియేషన్ నూతన కమిటీకి టీఎన్‌జీఓస్ నేతల అభినందనలు



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నూతనంగా ఎన్నికైన శాతవాహన యూనివర్సిటీ నాన్ టీచింగ్ స్టాఫ్ (రెగ్యులర్) అసోసియేషన్ సభ్యులు కరీంనగర్ టి.ఎన్.జి.ఓస్ భవన్‌లో రాష్ట్ర టి.ఎన్.జి.ఓస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగేమ్ లక్ష్మణరావు, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, గూడ ప్రభాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, లవ్ కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు. శాతవాహన యూనివర్సిటీ అసోసియేషన్ అధ్యక్షులు వై. కిషోర్, ఆర్. భీమయ్య, జనరల్ సెక్రటరీ టీ. రాజేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ సి. హెచ్. నర్సయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. రమేష్, జాయింట్ సెక్ర టరీ ఆర్. సాయి, పబ్లిక్ సెక్రటరీ కే. శ్రీకాంత్, ట్రెజరర్ ఎస్. సంతోష్ కుమార్, ఈసీ సభ్యులు ఎ. యోజన, ఎండి. ఖాజా నూరుద్దీన్, ఎండి. ఫసియుద్దీన్, జి. లచయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం బీజేపీ వైఎమ్ సతీష్ కుమార్



**హుస్నాబాద్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదవి కంటే దేశం, విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం అని బీజేపీ వైఎమ్ మాజీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కొండబత్తిని సతీష్ కుమార్ అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయడం బీజేపీ రాజకీయ విలువలకు అద్దం పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయ వివాదాల్లో చిక్కుకోకుండా ఉండేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తప్పులు చేసి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నా కుర్చీలను అంటిపెట్టుకుని ఉండటం కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీల నైజమని విమ ర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యక్తుల కంటే వ్యవస్థల బలోపేతానికే ప్రాధాన్యత ఇస్తుం దని, బీజేపీకి పదవులు శాశ్వతం కావని, దేశ ప్రయోజనాలే శాశ్వతమని స్పష్టం చేశారు.

## శాంతిభద్రతలు, నేర నియంత్రణ, పోలీసింగ్ పై సమీక్ష సమావేశం



**జగిత్యాల, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణ, పోలీసింగ్ విధానాలపై బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్, ఐపీఎస్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, రికార్డులు, కేసు డైరీలు, సీసీటీఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును చట్టపరంగా నమోదు చేసి సత్వర చర్యలు తీసుకోవాలని, దర్యాప్తు నాణ్యతను పెంచి కోర్టుల్లో శిక్షల శాతం పెంచేలా పనిచేయాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డీసీఆర్‌బీ విభాగాలను పరిశీలించిన ఆయన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల ఛేదనలో మరింత పురోగతి సాధించాలని, డేటా ఖచ్చితత్వాన్ని కాపాడాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసుల పనితీరు సంతృప్తికరంగా ఉందని పేర్కొంటూ డీఐజీ భాస్కరన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం



**జగిత్యాల, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ధర్మపురి నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాదులో సమీక్ష సమావేశం జరిగింది. బీర్పూర్ మండలంలో నిర్మిస్తున్న రోళ్లవాగు ప్రాజెక్టులో ఆగస్టు 15లోపు షెట్టర్లు ఏర్పాటు చేసి 0.25 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాలువల పూడికతీత పనులకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ధర్మపురి మండల ంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులను ఆరు నెలల్లో పూర్తి చేసి 2027 జనవరి నాటికి రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెల్గటూర్ జంగల్ నాల ప్రాజెక్టు, గొల్లపల్లి యశ్వంత్‌రావుపేట, రంగధామునిపల్లి చెరువుల పూడికతీత పనులకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ధర్మపురి మండల నక్కలపేటలో కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదించగా, దీనికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో రైతులకు కావాల్సిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యమని మంత్రి అడ్లూరి తెలిపారు.

## ప్రజావాణి కార్యక్రమం తాత్కాలిక రద్దు కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూలై 27వ తేదీ సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. అదే రోజున జనాభా లెక్కలు, భూముల రీ-సర్వేకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నందున ప్రజావాణి జరగదని పేర్కొన్నారు. ప్రజలు ఆ రోజు ఐడీఓసీ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు. తదుపరి సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



**పెద్దపల్లి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈ రోజున జయంతి జరుపుతున్నామని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఎరుకల వర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మానుపాటి రవి మాట్లాడుతూ ఎరుకల సమాజ సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, ఎరుకల కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం డిమాండ్



**పెద్దపల్లి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) డిమాండ్ చేసింది. పెద్దపల్లి బీజేపీ జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రామగిరి అఖిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సుమారు రూ.15,000 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫామ్ పాండ్ పనులను పరిశీలోంచిన సర్పంచ్



**ఖానాపూర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండల సత్తెనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రామిరెడ్డి పల్లెలో జరుగుతున్న ఫామ్ పౌండ్ పనులను సర్పంచ్ శీర్ల విజయ్ ఆనంద్ కుమార్, వార్డు సభ్యులు శనివారం పరిశీలించారు. ప్రభుత్వం నీటి నిల్వలు, భూగర్భ జలాల పెంపు లక్ష్యంతో ఈ పనులు చేపడుతోందని వారు తెలిపారు. రైతులు త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

## ఉత్కంఠభరితంగా సాగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్ 7 ఖో-ఖో పోటీలు



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్--7 ఖో-ఖో పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మ్యాచ్‌లలో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. అండర్--14 విభాగంలో గీతా శ్రీ పాఠశాల, జ్యోతి విద్యానికేతన్, సాధు వాసవి, బివిబి పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాచారం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బౌరంపేట్, శ్రీ విద్యానికేతన్ మహబూబ్నగర్, ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఏకశిలా హై స్కూల్ వర్ధన్నపేట విజయం సాధించాయి. అండర్--17 విభాగంలో అక్షర వాగ్దేవి, ఫార్చ్యూన్ బటర్ఫ్లై, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బేగంపేట, బ్లూమింగ్ మిడిల్ స్కూల్, చిత్తూరి పాఠశాల, జిఎంఆర్ చిన్మయ, పల్లవి స్కూల్, విద్యా భారతి, శ్రీ ప్రకాష్, విఆర్ఎస్ విజ్ఞానజ్యోతి, మంటోసరి ఎలైట్, శాంతినికేతన్, ది శ్రీరామ్ యునీ స్కూల్, విద్యా భారతి, సంఘమిత్ర పాఠశాల విజేతలుగా నిలిచాయి. అండర్--19 విభాగంలో శ్రీ ప్రకాష్ విద్య, పల్లవి స్కూల్, అక్షర పాఠశాల నెల్లూరు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విజయాలు సాధించాయి. ఈ పోటీల్లో విద్యార్థుల ఉత్సాహం, పోటీ స్ఫూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఖో-ఖో అసోసియేషన్ ప్రతినిధులు, రిఫరీలు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, కోచ్‌లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇండ్ల పథకంపై బీజేపీ విమర్శలు



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం వసూళ్ల దందాగా మారిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ మాజీ మేయర్ వై. సునీల్ రావు విమర్శించారు. దరఖాస్తు పేరుతో రూ.100, ఈఎండీ పేరుతో రూ.10,000 వసూలు చేస్తూ, లబ్ధిదారులను ఎంపిక చేయక ముందే పేదల నుంచి వేల కోట్లు సేకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. మొత్తం రూ.11 లక్షల వ్యయంతో రూ.6 లక్షలు పేదలే భరిం చాల్సి రావడం సంక్షేమం కాదని, ఇది ప్రైవేట్ బిల్డర్ల వ్యాపారంలా ఉందని అన్నారు. జిహెచ్ ఎంసి ఎన్నికల దృష్ట్యా ఈ పథకాన్ని కేవలం హైదరాబాద్‌లోనే ప్రవేశపెట్టారని, రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో పేదలకు ఇలాంటి అవకాశం ఇవ్వకపోవడం వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయని విమర్శించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇచ్చే నిధులను వాడుకుంటూ ఇందిరమ్మ ఇండ్లు పేరుతో ప్రచారం చేయడం కాంగ్రెస్ మోసం అని పేర్కొన్నారు. పేదల కోసం కాదు, జిహెచ్ఎంసి ఎన్నికల కోసం వచ్చిన పథకమని ఆయన అన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
ఆదివారం,
జూలై 26, 2026



## రైతు మార్కెట్ పనులను పరిశీలించిన మేయర్



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని మార్కెట్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ శనివారం పరిశీలించారు. కాశ్మీర్ గడ్డలో నిర్మాణంలో ఉన్న రైతు మార్కెట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టులో ప్రారంభించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే పద్మనగర్‌లోని ఇంటిగ్రేటెడ్ వెజ్--నాన్ వెజ్ మార్కెట్ వినియోగంపై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 61వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ అథీఫ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పిఆర్‌ఏఎన్ ప్రాజెక్టు గోడపత్రిక ఆవిష్కరణ



**పెద్దపల్లి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పిఆర్‌ఏఎన్ ప్రాజెక్టు అవగాహన గోడపత్రికను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వంగర భవాని, సీనియర్ కన్సల్టెంట్ బి. దేవకుమార్ సంయుక్తంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్వాహకులు మాట్లాడుతూ, దివ్యాంగులు, మహిళలు, చిన్నారుల హక్కులు, సంక్షేమం కోసం ప్రత్యేకంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను సేకరించి, చట్టపరమైన సలహాలు, కౌన్సిలింగ్, మధ్యవర్తిత్వం ద్వారా సమస్య పరిష్కారం అయ్యేవరకు సేవలు అందించడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత అని పేర్కొన్నారు.న్యాయ సహాయం కోసం బాధితులు 9550627483 లేదా టోల్ ఫ్రీ 15100 నంబర్‌కు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## భగత్‌నగర్ దోపిడీపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆగ్రహం



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, వరుస దోపిడీలు జరుగుతున్నా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. భగత్‌నగర్‌లో దోపిడీకి గురైన మున్నాభాయ్ కుటుంబాన్ని శనివారం పరామర్శించిన ఆయన, వారం రోజుల్లోగా నిందితులను అరెస్ట్ చేయకపోతే బీఆంఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనరేట్ ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. బాధితులు గతంలోనే కారు దొంగతనం జరిగినప్పటికీ పోలీసులు స్పందించలేదని, అదే దుండగులు ఇప్పుడు ఇంటిపై దాడి చేసి 62 తులాల బంగారం, రూ.25 లక్షల నగదు దోచుకెళ్లారని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఉన్నప్పటికీ నిందితులను పట్టుకోలేకపోవడం పోలీసుల వైఫల్యమని గంగుల మండిపడ్డారు. కరీంనగర్ నగరం దోపిడీ దొంగలకు అడ్డాగా మారిందని, ప్రజలు భయాందోళనలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ రక్షణ కల్పించాలని పోలీసులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్,
కార్పొరేటర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా వెలిచాల రాజేందర్



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చామనపల్లి గ్రామాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చేందుకు ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు తెలిపారు. శనివారం గ్రామంలో ఈజీఎస్ బీవీజీ రామ్‌జీ పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి 25 లక్షల రూపాయలు మంజూరు చేయించామని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌కు అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, సర్పంచ్ బొగొండ ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎరువుల డీలర్‌కు షోకాజ్ నోటీసు జారీ



**హుస్నాబాద్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు యూరియా విక్రయించినట్లు నిర్ధారణ కావడంతో హుస్నాబాద్ పట్టణంలోని ఒక ఎరువుల డీలర్‌కు మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ షోకాజ్ నోటీసు జారీ చేశారు.ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు--1985 ప్రకారం గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరకు విక్రయించడం చట్టవిరుద్ధమని అధికారులు హెచ్చరించారు. డీలర్ నిర్ణీత గడువులో వివరణ ఇవ్వాలని, అది సంతృప్తికరంగా లేకపోతే లైసెన్స్ సస్పెన్షన్ లేదా రద్దు సహా చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులు ఎవరైనా అధిక ధరకు ఎరువులు విక్రయించినట్లు గమనిస్తే సంబంధిత ఆధారాలతో వ్యవసాయ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సందడి సందడిగా గోరింటాకు వేడుకలు



**హుస్నాబాద్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆషాఢ మాసం సందర్భంగా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో గోరింటాకు వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి చందు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. తాజా గోరింటాకు ఆకులను సేకరించి సంప్రదాయ పద్ధతిలో ఒకరికి ఒకరు పెట్టుకున్నారు. ఆటలు, పాటలు, జానపద గీతాలతో గ్రామమంతా సందడి నెలకొంది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గోరింటాకు తెలుగు సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని, ఇది మహిళల ఐక్యత, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మన సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వీవో అధ్యక్షురాలు, గ్రామ మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా ఆరవ విడత మొబైల్ రికవరీ మేళా





**నంద్యాల, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్త, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఐపీఎస్ పర్యవేక్షణలో, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతిష్టాత్మకంగా ఆరవ విడత మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు.ఈ సందర్భంగా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, తూర్పుగోదావరి, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నుండి రికవరీ చేసిన 594 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేశారు. వీటి విలువ సుమారు ?1,06,92,590గా ఉంది.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, “మొబైల్ ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలో కీలక భాగమైంది. కుటుంబ, వ్యాపార, ఉద్యోగ, బ్యాంకింగ్ వంటి వ్యక్తిగత సమాచారం మొత్తం మొబైల్‌లోనే ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ మొబైల్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలి” అని సూచించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ సుస్మిత ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాషా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి
పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



**బోడుప్పల్,జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రత్యేక ఓటరు జాబితా కార్యక్రమం బోడుప్పల్ పరిధిలోని న్యూ హేమ నగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు.ఈ సందర్భంగా బోడుప్పల్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిప్పల శ్రీధర్, ఉపాధ్యక్షుడు తుక్కోజీ అమరేందర్ తమ ఎన్యుమరేషన్ ఫారాలను బీ.ఎల్.ఓ ఇదుల రేణుకకు అందజేశారు. చిప్పల శ్రీధర్ మాట్లాడుతూ, “గతంలో ఒక్కరికీ రెండు మూడు చోట్ల ఓట్లు ఉండేవి. నకిలీ ఓటర్ల ఏరివేతకు ‘ఎస్ఐఆర్’ ఉపయోగపడుతుంది. ప్రతి అర్హుడు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి” అని సూచించారు.బీ.ఎల్.ఓ రేణుక మాట్లాడుతూ, “వృద్ధులు, దివ్యాంగులు బూత్ కేంద్రాలకు రాలేనప్పుడు సమాచారం ఇస్తే మేమే ఇంటికి వచ్చి ఫారాలను సేకరిస్తాం. ఆగస్టు 3వ తేదీ వరకు మాత్రమే ఫారాలను స్వీకరిస్తాం” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిప్పల శ్రీధర్, తుక్కోజీ అమరేందర్, బీ.ఎల్.ఓలు ఇదుల రేణుక, ముకేశ్, ఉదరి నరేష్, సరిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో ఎఐటియుసి పట్టణ కమిటీ ఎన్నికలు



**కల్వకుర్తి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ మోటర్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కల్వకుర్తి పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి జిల్లా నాయకుడు పులిజాల పరశురాములు మాట్లాడుతూ, ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేశం సైదులు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె. అమీర్, ఉపాధ్యక్షులుగా వాకిటి రాజేష్, కటికర్ల సాయిబాబు, ఎడ్ల జనార్ధన్, పరశురాం గౌడ్, కోశాధికారిగా జి. మహేష్, సహాయ కార్యదర్శులుగా ఖదీర్, నాగరాజు, శేఖర్ బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా యాదగిరి, మల్లేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, సుదంృన్, సాయికుమార్, కొండల్, శివ, అం జిలను ఎన్నుకున్నారు.ఈ ఎన్నికలతో కల్వకుర్తి పట్టణంలో ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కొత్త కమిటీ కృషి చేయనున్నట్లు
నాయకులు తెలిపారు.

## గడివేములలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన





**గడివేముల, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గడివేముల మండలం బూజనూరు స్వర్ణగ్రామాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పచ్చదనం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజా సేవల అమలు వంటి అంశాలను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. గ్రామంలో రెవెన్యూ సేవలు, వీఆర్వో, గ్రామ కార్యదర్శి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తరువాత బూజనూరు ఎంపీపీ పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి సూచించారు. మెగా పీటీఎం--4.0 ఏర్పాట్లు, బోధన విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియామకం



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీనారాయణ గతంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చొప్పదండి మండలం గుమ్లాపూర్ ఎంపీటీసీగా సేవలందించారు. కొత్త బాధ్యతలు స్వీకరించిన ఆయన, జిల్లాలో బీజేపీ, ఎస్సీ మోర్చా బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల పోరాటానికి నైతిక విజయం వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నీట్ పరీక్ష వివాదంపై విద్యార్థుల ఐక్య పోరాటం ఫలితంగానే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు.విద్యార్థుల ఉద్యమం నైతిక విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఆ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. దేశ యువతకు జరిగిన అన్యాయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడిన యువత దేశానికి స్ఫూర్తిగా నిలిచిందని రాజేందర్ రావు పేర్కొన్నారు.

## ఉమామహేశ్వరంలో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు



**అమ్రాబాద్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లమల్ల అటవీ ప్రాంతంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తన సతీమణి డా. చిక్కుడు అనురాధతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సుఖశాంతుల కోసం స్వామివారిని ప్రార్థించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, నల్లమల్ల ప్రాంతంలోని ప్రాచీన శివాలయాలను అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.శ్రీ లొద్ది మల్లయ్య స్వామి దర్శనానికి భక్తులకు ఒక్కరోజు అనుమతి లభించడం ఆనందకరమని, భవిష్యత్తులో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించుకునేలా అటవీ శాఖతో సమన్వయం చేసి అనుమతులు తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బీరం మాధవ్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## పదవులు కాదు విలువలే శాశ్వతం తిప్పర్తి నికేష్



**గన్నేరువరం, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పదవులు శాశ్వతం కావని, నాయకత్వం చూపే విలువలే శాశ్వతంగా నిలుస్తాయని బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ అన్నారు.శనివారం విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ ఎప్పుడూ దేశం ముందు, పదవి తర్వాత అనే సిద్ధాంతాన్ని విశ్వసిస్తుందని, ప్రజలకు సేవ చేయడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా చూడాలని సూచించారు.యువత సోషల్ మీడియాలో కనిపించే ప్రతి ప్రచారాన్ని నమ్మకుండా నిజాలను తెలుసుకుని ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలకు లోనుకాకూడదని హితవు పలికారు. విమర్శలు దేశ నిర్మాణానికి దోహదపడేలా ఉండాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్లు, డిజిటల్ ఇండియా, ఉపాధి అవకాశాల విస్తరణ వంటి రంగాల్లో యువత భవిష్యత్తును బలోపేతం చేసే కార్యక్రమాలు అమలవుతున్నాయని నికేష్ పేర్కొన్నారు. యువతను ఓటు బ్యాంకుగా కాకుండా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తిగా బీజేపీ చూస్తుందని స్పష్టం చేశారు.

## తొలి ఏకాదశి పర్వదినాన్ని బీరన్నకు ప్రత్యేక పూజలు



**సుల్తానాబాద్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ మండల గర్రెపల్లి గ్రామంలో కురుమ, గొల్ల కులస్తులు బీరన్న దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరంపరాగత ఆచారాలను పాటిస్తూ తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు కుటుంబ సుఖశాంతి, ఆయురారోగ్యాల కోసం బీరన్న దేవుని ప్రార్థించారు.

# ఈ నెల 26న ప్రారంభంకానున్న కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్

**సిద్దిపేట, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ నెల 26న ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, రైల్వే ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. మనోహరాబాద్--సిద్దిపేట రైల్వే మార్గంలో భాగంగా రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ స్టేషన్‌లో హై లెవల్ ప్లాట్‌ఫారం, షెల్టర్, నిరీక్షణ మందిరం, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నడుస్తున్న నాలుగు డెమూ రైళ్లకు ఈ స్టేషన్‌లో అదనపు స్టాపేజీ కల్పించారు. ప్రారంభోత్సవం సందర్భంగా సిద్దిపేట--సికింద్రాబాద్ డెమూ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు.కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌలభ్యం మెరుగుపడటంతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, నిత్య ప్రయాణికులకు కూడా ఈ స్టేషన్ ఉపయోగకరంగా మారనుందని అధికారులు తెలిపారు.

## తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉచిత నైపుణ్య శిక్షణ

**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్, కరీంనగర్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందించనున్నారు.గ్రూప్–బ్యాంకింగ్ సర్వీసెస్, ఎస్ఎస్సీ, ఆర్ఆర్బి, పోలీస్ నియామక పరీక్షలకు సంబంధించిన ఫౌండేషన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథలు దరఖాస్తు చేసుకోవచ్చు.ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జూలై 25 నుంచి ఆగస్టు 14 వరకు కొనసాగుతుంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా ఆగస్టు 18న విడుదల కాగా, ఆగస్టు 25 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి. మొత్తం 100 మందికి శిక్షణ అందించనున్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1,000 స్టైఫండ్, పుస్తక నిధి, రవాణా భత్యం కల్పిస్తారు.గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలు లోపు ఉండాలి. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇప్పటికే బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారు అర్హులు కారు.మరిన్ని వివరాలకు 08782268686 నంబర్‌లో లేదా – వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

# జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉపాధి నమోదు మేళా నిర్వహణ

**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రత్యేక ఉపాధి నమోదు మేళా జూలై 28న జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనా అధికారి తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో స్థానికత కలిగిన అర్హులైన నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు అధ్యయన ధృవీకరణ, పదో తరగతి మార్కుల మెమో, ఉన్నత విద్యా సర్టిఫికేట్లు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీతో హాజరుకావాలి.జిల్లా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పనా అధికారి కోరారు.

# మన్ కీ బాత్ విజయవంతం చేయాలి మాడ వెంకట్ రెడ్డి

**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని జూలై 26న ప్రతి బూత్ పరిధిలో విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ, జోన్ అధ్యక్షులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో ఒక ప్రభారీని నియమించి, కార్యక్రమాన్ని వీక్షించి వివరాలను 'సరల్ యాప్'లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.కార్యక్రమం అనంతరం బూత్ అధ్యక్షులు, బిఎల్ఎ–2లతో సమావేశమై కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై చర్చించాలని సూచించారు. ప్రతి బూత్ కమిటీ సమర్థవంతంగా పనిచేస్తుందో లేదో పరిశీలించి, అవసరమైతే కొత్త వారిని నియమించాలని ఆదేశించారు. మన్ కీ బాత్ కార్యక్రమం డిడి యాదగిరి ఛానల్‌లో ఉదయం 11 గంటలకు హిందీలో, 11.30 గంటలకు తెలుగులో ప్రసారం కానుందని ఆయన తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు కమ్మగోని చౌదరి గౌడ్



**పెద్దపల్లి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబు దారీతనం, నిష్పక్షపాతాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏఐపీసీ అధ్యక్షుడు కమ్మగోని చౌదరి గౌడ్ నాయకత్వంలో నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ, రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ శనివారం కార్యక్రమం జరిగింది. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలుస్తున్న ప్రజాస్వామ్య స్వరాలను అణచివేయకుండా, శాంతియుత నిరసన తెలిపే హక్కును గౌరవించాలని నాయకులు కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని, వారికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ నిరసనలో భారతి దేవి, కీర్తి హరీష్, సిరిసిల్ల శంకర్, కాల్వేన రవి, బొడ్డిపల్లి అశోక్, నెరువట్ల రామస్వామి, గడ్డం సాయి, గుర్రాల రాజు, సదానందం, రాజు, పోగుల తిరుపతి తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# ఉప్పల్ రింగ్ రోడ్ పునఃప్రారంభం



**ఉప్పల్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ నుండి నారపల్లి వరకు నిర్మిస్తున్న బండారు రాజి రెడ్డి క్యారిడర్ ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా గత రెండు నెలలుగా మూసివేసిన ఉప్పల్ రింగ్ రోడ్ శనివారం పునఃప్రారంభమైంది.ప్రస్తుతం ఉప్పల్ నుండి వరంగల్ వైపు వెళ్లే మార్గాన్ని మాత్రమే తెరిచారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల రాకపోకలకు అనుమతించారు. భారీ వాహనాలను మాత్రం లిటిల్ ఫ్లవర్ స్కూల్ రహదారి మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు.రింగ్ రోడ్ పునఃప్రారంభం కావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నందికొట్కూరులో బోరు వైర్ల చోరీ



**నందికొట్కూరు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు పట్టణంలోని కర్నూల్ రోడ్ బి ఆర్ ఆర్ నగర్ పాలకొమ్మ వద్ద గల మున్సిపాలిటీ బోరులో అమర్చిన 15 హెచ్‌పి మోటార్ వైర్లు, క్లోరిన్ డోజర్ పైపును గుర్తు తెలియని వ్యక్తులు కోసుకొని వెళ్లారు.శనివారం మున్సిపాలిటీ సిబ్బంది ఈ విషయాన్ని గమనించి వెంటనే మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ డి.ఈ. దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మున్సిపల్ ఏఈ దినేష్ కొత్త వైర్లను ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించారు.తరువాత మున్సిపాలిటీ అధికారులు ఈ ఘటనను సిఐ అశోక్ కుమార్కు తెలియజేశారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# 13వ వార్డులో ప్రజలకు ముప్పుగా మారిన మురికి గుంతలు, భారీ రాళ్లు

**– వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులకు కాలనీవాసుల వినతి**



**ఆమనగల్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ 13వ వార్డులో జనావాసాలకు ఆనుకుని ఉన్న సర్వే నెం. 662/ఆ/2లో లోతట్టు మురికి గుంతలు, భారీ రాళ్లు, కంపచెట్లు ఉండటంతో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని వార్డు కౌన్సిలర్ పుల్లారెడ్డి శ్రీశైలం అనూష ఆధ్వర్యంలో కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో మురికి నీరు నిల్వ ఉండటంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని, విషసర్పాలు, పందులు సంచరిస్తూ ఇళ్లలోకి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. చిన్నారులు ఆడుకునే సమయంలో గుంతల్లో పడే ప్రమాదం ఉండటంతో పాటు భారీ వర్షాలకు మట్టి జారి పెద్ద రాళ్లు సమీప ఇళ్లపై పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే మురికి గుంతలు పూడ్చివేసి, భారీ రాళ్లు, కంపచెట్లను తొలగించి ప్రమాదాన్ని నివారించాలని కోరారు. ఈ వినతికి గుజ్జర్ గోపి, చాంద్ పాషా, కుర్షిదా బేగం, మానస, లక్ష్మమ్మ, కళావతి, అమృతమ్మ, జంగమ్మ, గుజ్జరి రాజు, ఆయిలు రాము, యాదగిరి, కృష్ణారెడ్డి చారి, పవన్ తదితర కాలనీవాసులు మద్దతు తెలిపారు.

# విద్యార్థుల సమైక్య పోరాట ఫలితమే కేంద్ర మంత్రి రాజీనామా

**– విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలి**
**– లక్ష్మీ నర్సింహారెడ్డి**



**ఆమనగల్లు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన సమైక్య పోరాటానికి దక్కిన విజయమని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జి. లక్ష్మీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న లోపాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన ఉద్యమానికి ఈ పరిణామం నైతిక విజయమని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన ప్రభుత్వ తీరుపై వ్యక్తమైన ప్రజా ఆగ్రహానికి ఈ రాజీనామా నిదర్శనమని, యువత ఆకాంక్షలకు ప్రభుత్వం తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. రాజీనామాతోనే సరిపెట్టకుండా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టి పారదర్శక విధానాలను అమలు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. అన్యాయానికి గురైన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని లక్ష్మీ నర్సింహారెడ్డి స్పష్టం చేశారు.

# యువత పోరాటానికి తలవంచిన కేంద్రం.. విద్యాశాఖ మంత్రి రాజీనామా

**– పారదర్శక పరీక్షా వ్యవస్థకు నాంది పలకాలి**
**– ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కల్వకుర్తి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా భారత యువత సాధించిన ఘన విజయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నిజం, న్యాయం, జవాబుదారీతనం కోసం అలుపెరగకుండా పోరాడిన లక్షలాది మంది విద్యార్థులు, యువత, తల్లిదండ్రుల సంకల్పానికి ఈ పరిణామం నిదర్శనమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం వారి గొంతుకను పార్లమెంట్ లోపల, బయట బలంగా వినిపిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని జవాబుదారీతనం కోరిన ప్రతిపక్షాల పోరాటం ఫలితంగానే ఈ రాజీనామా జరిగిందని అన్నారు. రాజీనామాతోనే వ్యవహారం ముగిసిపోకూడదని, దేశంలోని ప్రతి విద్యార్థిలో విశ్వాసాన్ని నింపేలా పారదర్శకమైన, విశ్వసనీయమైన, ప్రతిభకు న్యాయం చేసే పరీక్షా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. "యువత న్యాయం కోసం ఏకమైతే... ప్రజాస్వామ్యం తప్పక స్పందిస్తుంది" అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలే లక్ష్యం



**– రూ.25 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం**
**– మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్**

**ఆమనగల్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ 6వ వార్డులో గౌరవ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, మాజీ వార్డు సభ్యుడు పూసల సత్యం, స్థానిక నాయకులు పుల్లయ్య, తోట కృష్ణ యాదవ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు వ్యవసాయ విద్యపై అవగాహన



**నందికొట్కూరు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని లక్ష్మాపురంలో ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో వ్యవసాయ రంగంపై ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 9వ, 10వ తరగతులు మరియు ఇంటర్మీడియట్ విద్యార్థినులకు వ్యవసాయ బోధన అందిస్తున్న ఒకేషనల్ లెక్చరర్ శివపురం నజియా ఆహ్వానం మేరకు దేసి డీలర్ గుజ్జుల గౌరీశ్వర నాయుడు గెస్ట్ లెక్చరర్‌గా హాజరై విద్యార్థినులకు బోధించారు.విద్యార్థినులకు నీటి పొదుపును ప్రోత్సహించే స్ప్రింక్లర్, డ్రిప్ ఇరిగేషన్ (బిందు--తెలికపాటి సేద్యం) ప్రాముఖ్యతను వివరించారు. సూక్ష్మ సేద్య విధానాల వల్ల కలిగే ప్రయోజనాలను స్పష్టంగా తెలియజేశారు. ఆసక్తిగా ప్రశ్నలు అడిగిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ బీమా ప్రీమియం చెల్లించాలి సిపిఐ(ఎంఎల్)



**నందికొట్కూరు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు నియోజకవర్గం మిడుతూరు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో మెట్ట రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు శనివారం పలు గ్రామాల్లో రైతుల పంట పొలాలను పరిశీలించిన అనంతరం తెలిపారు.కిసాన్ మహాసభ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో ఆయన మాట్లాడుతూ, "2026 ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాలపై ఆధారపడి మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, మినుము, పెసర, కంది తదితర పంటలను అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. అయితే ఎల్‌నీనో ప్రభావంతో జూలై నెలాఖరు వరకు ఆశించిన వర్షాలు కురవక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.30,000 నష్టపరిహారం, కౌలు రైతులతో పాటు అందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ, అలాగే ప్రైవేట్ అప్పుల భారాన్ని తగ్గించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ పర్యటనలో సిపిఐ(ఎంఎల్) మండల కార్యదర్శులు మేకల చంద్రశేఖర్, కాటేపోగు సామన్న, రైతు నాయకులు కె. తిరుపాలు, జాకీర్, నాగశేషులు తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని వారు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు.

# ఘనంగా తొలి ఏకాదశి ఉత్సవాలు



**మర్రిగూడ, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం తొలి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏడాది పొడవునా జరిగే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుక్ల ఏకాదశి తొలి ఏకాదశిగా పరిగణించబడుతుంది. వానాకాలంలో వచ్చే మొదటి ఏకాదశి కావడంతో దీనిని తొలి ఏకాదశిగా లౌకికంగా వ్యవహరిస్తారు.ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, నగరేశ్వర స్వామికి అభిషేకాలు, కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం సామూహికంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి.అన్నపూర్ణ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## యాదగిరిగుట్టలో ఘనంగా ఏకాదశి లక్ష పుష్పార్చన



**యాదగిరిగుట్ట, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారికి ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.ఈ సందర్భంగా సుగంధ పరిమళ పుష్పాలతో లక్ష పుష్పార్చన ఘనంగా చేపట్టారు. పాంచరాత్రాగమానుసారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు పాల్గొని స్వామివారి కృపను పొందారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన వెంకటగిరి దేవస్థానం

**– శయన ఏకాదశి సందర్భంగా విశేష పూజలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం**



**ఆమనగల్లు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శయన ఏకాదశి (తొలి ఏకాదశి) సందర్భంగా ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గూడ కృష్ణమాచార్య ఆధ్వర్యంలో స్వామివారికి మహాభిషేకం, శ్రీ వెంకటేశ్వర సహస్రనామ తులసీదళ అర్చన, ప్రబంధ పారాయణం, మంగళశాసనం వైదిక సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం, విశేష అర్చనలు, గోపూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. "గోవింద.. గోవింద" నామస్మరణలతో ఆలయం మార్మోగగా మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శయన ఏకాదశి వేడుకలు భక్తిపారవశ్య వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

# ఆనాటి పల్లె -అనుబంధాల ముల్లె



లిగంజనీళ్లు తాగినా
కాళ్లు రెక్కలు గుంజలేదు
చింతకాయ తొక్కుతో తిన్నా
చీకు చింత లేకపాయే
మామిడికాయ తొక్కేసుకున్నా
మధురంగా అనిపించే
గడకతిని అంబలి తాగినా
అంబరాన్ని అందుకున్న
సంబరమాయె
పెంచుకున్న బర్ల పాలు
పంచెను ఎన్నో మురిపాలు
లికోళ్లను పుంజులను పెంచి
పండుగకో పబ్బానికో
చుట్ట పక్కాలస్తెనో
కోసుకొని తినుడాయే
దసరకో సంక్రాంతికో
వాడకట్టోళ్లు కుప్పకూడి
మేకను కోసి కుప్పలేసుకొని
పండుగను దండిగా చేసుకునుడాయే
మితాహారం
పరిమిత వ్యవహారం
ఆరోగ్యానికి మణిహారం
లివృత్తి పని
వ్యవసాయ పని
పని ఏదైనా పాట మేళవింపు
పనితో పాట.. పాటతో పని
మనసుకు హాయి
గాడ నిద్రే ప్రతి రేయి
లిపందిరికి పారిన
తీగ కూరలు
పెరట్లో మొలిసిన
ఆకుకూరలు
చేను చెలకల్లో పెరిగిన
కూరగాయలు
కట్టెల పొయ్యి వంట
లేనే లేదు కళ్ళమంట
లిచేను దగ్గరే తంపి పెట్టి
కాల్చుకుని తిన్న
పల్లికాయ మక్కకంకులు
శుచి మాటేమో గానీ
అద్భుతమైన రుచి
స్టార్ హోటల్లో సైతం
పొందని అనుభూతి
వరసలతో పిలుపులు
ఆత్మగల్ల పలుకులు
మంచైనా.. చెడైనా..
మాటలతోనే కాదు
చేతలతో తలో చెయ్యేసి
చేయూతనిచ్చే
చల్లని మనసున్న
పల్లె తల్లి
అందుకే అన్నారేమో..
ఉన్న ఊరు కన్నతల్లి
స్వచ్ఛమైన కల్పవల్లి

**జప్త. శ్రీనివాస్**
**ఉపాధ్యాయుడు**
**కనుకుల**
**స్వగ్రామం: ఎలిగేడు**
**(పల్లెలో పుట్టి పెరిగిన అనుభూతిని నెమరు వేసుకుంటూ రాసిన కవిత)**

# హరితహారంతో పచ్చదనానికి శ్రీకారం

**– సరికొండలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ పాలకూర్ల మహేందర్ గౌడ్**

**ఆమనగల్లు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో పచ్చదనాన్ని 33 శాతానికి పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా సరికొండ గ్రామపంచాయతీలో శని వారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాలకూర్ల మహేందర్ గౌడ్ చేతుల మీదుగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హరితహారం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, భావితరాలకు



స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే మహత్తర ప్రజా ఉద్యవ

ుమని అన్నారు. ప్రతి గ్రామం పచ్చదనంతో కళకళలాడాలంటే ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొని మొక్కలు నాటి హరితహారం విజయ ంతానికి తమ వంతు సహకారం అందించారు. కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# ప్రజలకు మెరుగైన పోలీసు సేవలే లక్ష్యం

**– ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ జానకి రెడ్డి**
**– పెండింగ్ కేసుల పరిష్కారం, సైబర్ నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌పై కీలక ఆదేశాలు**

**ఆమనగల్లు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం డివిజన్ ఏసీపీ ఎస్. జానకి రెడ్డి శనివారం అమన్‌గల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, విజిబుల్ పోలీసింగ్, శాంతిభద్రతల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేపడుతున్న చర్యలను ఏసీపీకి వివరించారు. అనంతరం స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఏసీపీ పలు కీలక సూచనలు జారీ చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు గ్రేవ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రాధాన్యం



ఇవ్వాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొంది ంచడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థ వంతమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. సీసీటీఎన్ఎస్ , ఈ-సాక్షి వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని, స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, హరితవ నంగా ఉంచాలని పేర్కొన్నారు. సైబర్ భద్రత, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఏసీపీ జానకి రెడ్డి సూచనలను పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ప్రజలకు మరింత వే గవంతమైన, నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందిం చేందుకు కట్టుబడి పనిచేస్తామని ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

# మర్రిగూడ జంక్షన్ లో నూతన ఫ్లైఓవర్ ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ,జులై 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నార్కట్‌పల్లి – అద్దంకి – మేదరమెట్ల రహదారిపై మర్రిగూడ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో నల్గొండ పట్టణవాసులతో పాటు, ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మర్రిగూడ జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రజలకు సురక్షితమైన అలాగే వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుంది. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనడానికి ఈ ప్రాజెక్టు ఒక ప్రత్యక్ష నిదర్శనం. రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా నల్గొండ ప్రాంత ఆర్థిక మరియు వాణిజ్య వృద్ధికి ఈ నూతన ఫ్లైఓవర్ రహదారిని సుగమం చేస్తుంది. ఈ అభివృద్ధి కార్యక్రమం పట్ల ప్రాంతీయ ప్రజలు మరియు ప్రయా ణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్య క్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి బూత్‌లో అర్హులైన ప్రతి ఓటు నమోదు చేయడమే లక్ష్యం

**– ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
**– సమన్వయంతో పనిచేసి జూలై 30లోపు ప్రత్యేక సవరణ పూర్తి చేయాలి**

**ఆమనగల్లు, జూలై 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రతి బూత్‌లో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయించడం కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు), బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పార్టీ బలోపేతం, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, బూత్ నిర్వహణ, కార్యకర్తల బాధ్యతలపై కీలక దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు గ్రామాలు, బూత్‌ల వారీగా 85 శాతం ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేశారని పేర్కొంటూ సమర్థంగా



పనిచేసిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. మిగిలిన ప్రక్రియను వేగవంతం చేసి జూలై 30లోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పేర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి చేరుకుని ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామాలు, తండాలు, వార్డుల్లో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి కార్యకర్త పార్టీకి బలమైన ప్రతినిధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు, బీఎల్ఏలు, బూత్ కమిటీ సభ్యులు సమష్టిగా పనిచేస్తే కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, పీసీసీ సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, భట్టు కిషన్ రెడ్డి, పోతుగంటి శంకర్, కాసు శ్రీనివాస్ రెడ్డి, హరి కిషన్ నాయక్, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, పుస్తకాల రాహుల్తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చర్లపల్లి చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**నల్లగొండ, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ పట్టణ పరిధిలోని చర్లపల్లి చేనేత సహకార సంఘం లిమిటెడ్ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "చేనేత కళ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, మన అస్తిత్వానికి ప్రాణవాయువు లాంటిది. కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి నేసే అద్భుతమైన వస్త్రాలు మన రాష్ట్రానికి దేశస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి" అని అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, వారి జీవనోపాధి బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. సహకార సంఘాలు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వ పథకాలు సక్రమంగా కార్మికులకు చేరేలా చూడాలని సూచించారు. చ ేనేత రంగ



అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ, ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం కల్పించడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం, యువతను చేనేత రంగం వైపు ఆకర్షించే కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. నూతన పాలకవర్గం సమష్టి కృషితో చర్లపల్లి చేనేత సహకార సంఘం మరింత అభివృద్ధి సాధించి, కార్మికులకు ఆదర్శంగా నిలవాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

# చర్లపల్లిలో చేనేత సహకార సంఘాల అవగాహన సదస్సు కరపత్రం ఆవిష్కరణ

**నల్లగొండ, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 4న హైదరాబాదులోని కర్నాటి గార్డెన్స్లో రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులకు అవగాహన సదస్సు జరగనుంది. ఈ సదస్సు విజయవంతం కావాలని కోరుతూ చర్లపల్లి చేనేత సహకార సంఘం భవనంలో శనివారం జరిగిన సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే తెలంగాణ చేనేత కార్మిక సంఘం చేనేత పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరాయంగా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తోంది. 2013 తర్వాత ఎన్నిక లు జరగకపోవడంతో అనేక పోరాటాల అనంతరం 2026 జూలైలో ఎన్నికలు జరగడం చేనేత రంగానికి కొత్త



ఊపునిచ్చింది" అని అన్నారు. నూతన పాలకవర్గ సభ్యులకు సహకార సంఘాల బలోపేతం, కార్మికుల సంక్షేమం, చట్టాలపై అవగాహన కల్పించేందుకు సీనియర్ రిటైర్డ్ అధికారి మూనాస వెంకటేశం, రిటైర్డ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రత్యేక బోధన అందించనున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన అధ్యక్షులు, సభ్యులు హాజరై సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశ అనంతరం నూతన పాలకవర్గ సభ్యులకు అభినందన సభ నిర్వహించి మెమెంటోలు అందజేశారు. చర్లపల్లి పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఆగస్టు 4న జరగనున్న సభాకార పత్రాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం అధ్యక్షుడు ముషం రవి, ఉపాధ్యక్షులు గంజి రమేష్, కార్యదర్శి గంజి రమేష్, కోశాధికారి రాపోలు శేషమ్మ, డైరెక్టర్లు రాపోలు గణేష్, చిట్టిపోలు రమేష్, కటకం వెంకటేశ్వర్లు, రాపోలు బిక్షం, గంజి వెంకమ్మ, పవర్ లూమ్ వీవర్ రాపోలు శ్రీను, మేనేజర్ దేవలపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో మత్తు పదార్థాలపై విస్తృత తనిఖీలు



**దేవరకొండ, జూలై 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌ఓ రాజు ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో డాగ్ స్క్వాడ్ సహాయంతో నిషేధిత మత్తు పదార్థాలపై విస్తృత తనిఖీలు చేపట్టారు. స్థానిక బస్టాండ్, లాడ్జీలు, పాన్ షాపుల్లో పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "గంజాయి సహా నిషేధిత మత్తు పదార్థాలను ఎవరైనా వినియోగించినా, రవాణా చేసినా వెంటనే సమాచారం ఇవ్వాలి. సమాజంలో మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలి" అని విజ్ఞప్తి చేశారు.

# సర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

**-దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**

**దేవరకొండ జూలై 25.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**దేవరకొండ నియోజకవర్గంచింతపల్లి మండలం తీదేడు, మల్లారెడ్డిపల్లి, తక్కళ్లపల్లి, వింజమూరు గ్రామాల్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పర్యటించి సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ) ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంఆర్వో, బీఎల్ఓలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమై, ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు నమోదు, వివరాల సవరణ వంటి ప్రక్రియలను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఇంటికి చేరవేసి, ప్రజలు తమ వివరాలను సకాలంలో ధృవీకరించుకునేలా కృషి చేయాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఏలు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలకపల్లి పీహెచ్‌సీపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**తెలకపల్లి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.ఆసుపత్రిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన కలెక్టర్, విధుల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రక్తపరీక్షలు, నిర్ధారణ పరీక్షలు, నమూనాల సేకరణ, ఫలితాల విడుదల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికలు సకాలంలో రోగులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందుల నిల్వలను పరిశీలించిన కలెక్టర్, సాధారణ రోగాలకు అవసరమైన ఔషధాలతో పాటు కుక్కకాటు, పాముకాటు చికిత్సకు సంబంధించిన మందులు



ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మందుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను హెచ్చరించారు.రోగులపట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించి అవసరమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందన వేగంగా ఉండేలా సమన్వయంతో పనిచేయాలని, రోగులకు అవసరమైన అన్ని సేవలు ఒకేచోట అందేలా సమర్థవంతమైన వ్యవస్థను కొనసాగించాలని ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయుష్ విభాగం వైద్యుడికి ప్రత్యేక సూచనలు చేస్తూ, ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. రోజువారీ ఆహారపు అలవాట్లు, పోషకాహారం, వ్యాయామం, యోగా, మానసిక ఆరోగ్య పరిరక్షణ, జీవనశైలి సంబంధిత జాగ్రత్తలపై ప్రతి రోగికి అవగాహన కల్పించాలని సూచించారు.ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్ హెచ్చరిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచే విధంగా సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీలో మండల స్థాయి అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బోడబండ తాండా ప్రభుత్వ పాఠశాలకు పునర్జీవం

**కల్వకుర్తి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ సూచించారు. శనివారం ఆయన కొల్లాపూర్ మండలంలోని బోడబండ తాండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యా కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు.గత ఐదేళ్లుగా కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరయ్యే పరిస్థితి ఏర్పడడంతో పాఠశాల మూతపడే స్థితికి చేరింది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో ఒక్క విద్యార్థి కూడా నమోదు కాకపోవడంతో పాఠశాల కొనసాగింపే ప్రశ్నార్థకమైంది. అయితే గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కలిసి చేసిన కృషి ఫలితంగా ప్రస్తుతం 40 మంది విద్యార్థులు చేరడం పాఠశాలకు పునర్జీవం ఇచ్చింది.డీఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే సమాజం భాగస్వామ్యం అత్యంత అవసరమని, బోడబండ తాండా గ్రామస్తులు చూపిన



చొరవ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. విద్యార్థుల్లో ఆంగ్ల మాధ్యమ బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచేలా ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని ఆయన కోరారు.గ్రామస్తులు, మాజీ జడ్పీటీసీ హనుమంతు నాయక్ వినతిపత్రం సమర్పించి, ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని, మరో ఉపాధ్యాయుడిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీఈఓ సంబంధిత అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం ఆయన ఏల్లూరు గ్రామంలోని అక్షర ప్రైవేట్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు మౌలిక వసతులు, ఉపాధ్యాయుల అర్హతలు, హాజరు రిజిస్టర్లు, తరగతి గదుల పరిస్థితి, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం మండల విద్యాధికారి (ఎంఈఓ)తో మాట్లాడి, పూర్తి స్థాయిలో తనిఖీ నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ విద్యాసంస్థ పనిచేసినా ఉపేక్షించబోమని, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే పరిస్థితిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని డీఈఓ రమేష్ కుమార్ స్పష్టం చేశారు

# కల్వకుర్తిలో ఘనంగా శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగం

**– ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీ సింగ్**

**కల్వకుర్తి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సమేతంగా మహాయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఠాకూర్ బాలాజీ



సింగ్ సైతం కుటుంబ సమేతంగా హాజరై యాగంలో పాల్గొన్నారు. విశ్వశాంతి, ప్రజల సుఖసంతోషాలు, సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ నిర్వహించిన మహాయాగానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా యాగ నిర్వాహకులు, ఆధ్యాత్మిక గురువులు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, యాగ క్రతువులను నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో యాగ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నిర్వాహకులు జూలూరి రమేష్‌బాబు, మదన మురళి, తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీచాని బాలకృష్ణ, కల్వ మనోహర్, కల్వ రమేష్, వాస శేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక గురువులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉద్యమంతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం

**కరీంనగర్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన చారిత్రక విజయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ చౌక్ నుండి గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేంద్ర రావు, మాజీ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉట్కూరు నరేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు



నాయకులు పాల్గొన్నారు.అంజన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉద్యమానికి తలవంచిన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవించిందని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి నైతిక విజయం అని అన్నారు. విద్యార్థుల ప్రజాస్వామ్య ఉద్యమాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అండగా నిలిచారని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ మరియు ప్రతిపక్షాలు బీజేపీ ప్రభుత్వంపై తిరగబడుతున్న సందర్భంలో ఈ రాజీనామా విద్యార్థుల ధైర్యసాహసానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ శాంతి ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

# నక్రేకల్‌లో గంజాయి కేసు నలుగురి అరెస్టు

**నల్లగొండ, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**భద్రాద్రి--ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయిని సేకరించి, నక్రేకల్‌కు తరలించి పొదల్లో దాచిపెట్టి అమ్ముతూ, సేవిస్తూ ఉన్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు.ఈ దాడిలో పోలీసులు 3.045 కిలోల గంజాయి, ?1,52,250 విలువైన మత్తు పదార్థం, ఒక స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు, నక్రేకల్ ఎస్ఐ పి. వీరబాబు బృందం జూలై 24న ఎన్.హెచ్-65 తటికల్ ఫ్లైఓవర్ వద్ద ఆకస్మిక దాడి నిర్వహించి, గంజాయి సేవించడానికి సిద్ధమవుతున్న నిందితులను పట్టుకుంది.ఈ ఘటనపై నక్రేకల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 213/2026 కింద చీణూా చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం కేసు నమోదు చేశారు. భద్రాద్రి--ఒడిశా సరిహద్దు నుంచి నక్రేకల్ వరకు విస్తరించిన సరఫరా నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ, "మాదకద్రవ్యాలపై జీరో--టాలరెన్స్ విధానం కొనసాగుతుంది. కొనుగోలు, రవాణా, నిల్వ, అమ్మకం, పంపిణీ లేదా వినియోగంలో పాలుపంచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం అందించాలని, వారి గుర్తింపును గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ఈ కేసును నల్గొండ డీఎస్పీ కె. శివరామ రెడ్డి పర్యవేక్షణలో, నక్రేకల్ సీఐ హరిబాబు నాయకత్వంలో, ఎస్ఐలు పి. వీరబాబు, జి. కృష్ణచారి మరియు పోలీసు సిబ్బంది ఛేదించారు. సమర్థవంతంగా పనిచేసినందుకు ఎస్పీ పోలీస్ బృందాన్ని అభినందించారు.



# ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు



**నందికొట్కూరు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నందికొట్కూరు మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని ప్రార్థించి తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని కోరుకున్నారు.తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

# కల్వకుర్తిలో విద్యార్థులపై మతమార్పిడి ఒత్తిడి ఆరోపణలు




**కల్వకుర్తి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**కల్వకుర్తి పట్టణంలోని నిర్మల విద్యాలయం మిషనరీ స్కూల్ హాస్టల్ విద్యార్థులు మతమార్పిడి ఒత్తిడి, దాడులపై పోలీసులను ఆశ్రయిం చారు.విద్యార్థుల వాంగ్మూలం ప్రకారం, హాస్టల్ వార్డెన్ జయశ్రీ, నన్స్ గత కొన్నేళ్లుగా ప్రతిరోజూ ప్రార్థనలు చేయాలని, ఆదివారాలు తప్పకుండా చర్చికి రావాలని, బొట్టు తుడిచేయాలని బలవంతం చేస్తున్నారని తెలిపారు. ఆదేశాలను పాటించని విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టడం, మోకాళ్లపై కూర్చోబెట్టి కొట్టడం వంటి శిక్షలు విధిస్తున్నారని వారు ఏడుస్తూ వివరిం చారు.విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్ జురీల్ను నిలదీశారు. గతంలో ఇలాంటి చర్యలు జరిగాయని, ఇకపై జరగవని ప్రిన్సిపల్ సమాధానం ఇవ్వడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ బాధను ఎస్సై కురుమూర్తికి వివరించి కన్నీరు మున్నీరయ్యారు. విద్యార్థులకు ధైర్యం చెప్పిన ఎస్సై, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు గన్నోజు బాబీదేవ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు, వార్డు కౌన్సిలర్లు, బీజేవైఎం నాయకులు, ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రశాంత్ యాదవ్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# చెన్నంపల్లిలో సెల్ టవర్ ఏర్పాటుకు ఎంపీ మల్లు రవి చొరవ

**– బీఎస్ఎన్ఎల్ సీఎంజీఎంకు సిఫారసు లేఖ అందజేత--త్వరగా టవర్ ఏర్పాటు చేయాలని వినతి**



**ఆమనగల్, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చెన్నంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో తీవ్రంగా ఉన్న సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సమస్య పరిష్కారానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి చొరవ చూపారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయాలని తెలంగాణ బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ రామాంజనేయులుకు సిఫారసు లేఖ జారీ చేశారు. శనివారం చెన్నంపల్లి గ్రామ సర్పంచ్ ప్రశాంతి రవికుమార్, ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు కలిసి బీఎస్ఎన్ఎల్ సీఎంజీఎం రామాంజనేయులను కలిసి ఎంపీ మల్లు రవి సిఫారసు లేఖను అందజేశారు. చెన్నంపల్లి గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామంలో వీలైనంత త్వరగా స్థల పరిశీలన (వెరిఫికేషన్) పూర్తి చేసి బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. సెల్ టవర్ ఏర్పాటు ద్వారా గ్రామ ప్రజలకు నాణ్యమైన మొబైల్ నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా తొలి ఏకాదశి పర్వదినం వేడుకలు



**కల్వకుర్తి, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో వెలసిన శ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం తొలి ఏకాదశి పర్వదినం భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది.వేకువజామునే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. స్వామివారికి అభిషేక కైంకర్యం, విశేషాలంకరణ, కోమల సేవ, అష్టదల పాదప ద్మారాధన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి డోల ఉత్సవం, ప్రాకరోత్సవం, పల్లకి సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ కల్వ మనోహర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్వామివారికి పెద్ద సంఖ్య లో భక్తులు అభిషేకాలు నిర్వహించి తమ కుటుంబాల సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేశారు.

# శివపల్లిలో ప్రభుత్వ విప్‌కు ఘన సన్మానం



**ఎలిగేడు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి హోదా కల్పించిన సందర్భంగా శనివారం ఎలిగేడు మండలం శివపల్లిలోని ఆయన నివాసంలో కాల్వశ్రీరాంపూర్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సర్పంచ్ బంగా రమేశ్, ఉపసర్పంచ్ గోలి సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సబ్బని రాజమల్లు, ఏఎంసీ డైరెక్టర్లు దాగేటి రామచంద్రం, అనగంటి రవి, నాయకులు ఎండీ మునీర్, శివరామకృష్ణ, కొంతం మధుకర్, సదయ్య, నర్సయ్య, అన్వేష్, రాజేందర్, సాగర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం, జూలై 26, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే:



**హైదరాబాద్, జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇది విద్యార్థులు సాధించిన విజయం: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ప్రధాని నరేంద్ర మోదీ తన పదవి కాపాడుకోవడానికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. నీట్ పరీక్ష లీక్ జరిగినప్పుడే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చేదే కాదన్నారు. మూడు నెలల పాటు ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించిన ఆయన.. విద్యార్థులపై పెరిగిన ఒత్తిడి, నిరసనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. యువత తమ దమ్ము ఏంటో నిరూపించారని, వారి పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో పేపర్ లీకులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో బీజేపీ పతనం ప్రారంభమైంది: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హైదరాబాద్: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను

# భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు



**ఎలిగేడు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం తొలి ఏకాదశి పర్వదినం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఉదయాన్నే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం నామస్మరణలతో మారుమ్రోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఇళ్లల్లో కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆనందోత్సాహాల మధ్య పర్వదినాన్ని జరుపుకున్నారు. భక్తుల ప్రార్థనలతో ఎలిగేడు గ్రామాలు ఆధ్యాత్మిక కాంతితో నిండిపోయాయి.

# రైతుల అవగాహన కోసం కూరగాయల మార్కెట్‌లో ప్రత్యేక ఫ్లెక్స్ ఏర్పాటు



**ఆమనగల్, జూలై 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో రైతులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చట్టం--1966 ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం తరపున ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఉావీజ) ఆధ్వర్యంలో ప్రత్యేక సమాచార ఫ్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. రైతులు మార్కెట్ చట్టంలోని నిబంధనలు, హక్కులు, సౌకర్యాలు తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ ఫ్లెక్స్‌లో రైతులు వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సమయంలో పొందాల్సిన హక్కులు, మార్కెట్‌లో అందుబాటులో ఉన్న సేవలు, ప్రభుత్వ నిబంధనలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను పొందుపరిచారు. దీంతో రైతులు మార్కెట్ వ్యవస్థపై పూర్తి అవగాహన పెంపొందించుకొని తమ పంటలకు తగిన రక్షణతో పాటు న్యాయమైన లావాదేవీలు జరుపుకునేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ కోరారు.

# నీట్ టాపిక్ డైవర్షన్ కోసమే కేటీఆర్‌ను టార్గెట్ చేసిన బండి సంజయ్, రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నీట్ స్కాంపై యువతకు మద్దతుగా నిరసన చేస్తే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కలిసి ఆయనను టార్గెట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ ఇష్యూ జరుగుతుంటే బండి సంజయ్, రేవంత్ రెడ్డి టాపిక్‌ను కేటీఆర్ మీదకు డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయం కోసం పోరాటం చేస్తున్న యువతను బీజేపీ వాళ్లు తీవ్రవాదులు, విదేశీ ఫండింగ్ వస్తుందని అంటున్నారు. ఒక తండ్రిగా కేటీఆర్ ఆ యువతకు మద్దతుగా నిలిచారు.. ఆయన చేసిన తప్పేంటి..? అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ బండి సంజయ్, రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టి తలతోక లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఎవరు ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించినా కేటీఆర్ పేరు తీసి ఆయనపై ఆరోపణలు చేస్తున్నారు. నీట్ ఉద్యమం జరుగుతుంటే దాన్ని డైవర్ట్ చేయడానికి బండి సంజయ్, రేవంత్ రెడ్డి కలిసి కేటీఆర్‌ని టార్గెట్ చేశారని మన్నె క్రిశాంక్ విమర్శించారు. బండి సంజయ్, రేవంత్ రెడ్డి మంచి మిత్రులు.. బండి సంజయ్ కొడుకును పోక్సో కేసులో వెంటనే పట్టుకోకుండా రేవంత్ రెడ్డి 9 రోజులు ప్రొటెక్షన్ ఇచ్చాడు.. ఇప్పుడు బెయిల్ కూడా వచ్చిందని మన్నె క్రిశాంక్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నీట్ పేపర్ లీక్ నిరసనలు కాకుండా కేటీఆర్‌ను బద్నాం చేయాలని బండి సంజయ్, రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారు. గత ప్రభుత్వంలో గ్రూప్-1 పేపర్ లీక్ అయితే ఆ ప్రభుత్వమే గుర్తించి, లీక్ చేసిన వారిని పట్టుకొని కేసు ఫైల్ చేసి జైలుకు పంపింది..కానీ సంబంధం లేకపోయినా 7 సంవత్సరాల నుంచి ఒకటే అబద్ధాన్ని రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి నిస్సిగ్గుగా చెబుతున్నారని మన్నె క్రిశాంక్ మండిపడ్డారు. గ్లోబరీనా కేటీఆర్ బినామీకి చెందిందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు జేఎన్టీయూ కాకినాడనే గ్లోబరీనా సంస్థకు కాంట్రాక్టులు ఇచ్చింది. కేటీఆర్ బినామీ సంస్థ అయితే గ్లోబరీనా సంస్థకు కాంట్రాక్టులు ఎందుకు ఇచ్చారు..? అని మన్నె క్రిశాంక్ అడిగారు. 2012లో కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ సమ్మిట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఆ కార్యక్రమానికి గ్లోబరీనా సంస్థనే స్పాన్సర్ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుండే గ్లోబరీనాతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయి. బీజేపీ మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ గ్లోబరీనా సంస్థకు గతంలో అవార్డు కూడా ఇచ్చారు. ఈ సంస్థ ద్వారా దేశంలో ఎన్నో కాంట్రాక్టులు చేస్తున్నారన్నారు.

# సర్కారు బడులపై పెరుగుతున్న నమ్మకం.. లక్షకు పైగా ప్రైవేట్ విద్యార్థుల చేరిక, ఫీజుల భారం నుంచి విముక్తి



**హైదరాబాద్,** సర్కారు బడులపై తల్లిదండ్రుల నమ్మకం క్రమంగా బలపడుతోంది. ప్రైవేట్ స్కూళ్లపై ఉన్న భ్రమలను వీడుతున్న సామాన్య, మధ్యతరగతి వర్గాలు ప్రభుత్వ చదువుల వైపు అడుగులు వేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఏకంగా లక్ష మందికి పైగా విద్యార్థులు సర్కారు బడుల్లో చేరడం గమనార్హం. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల భారం విపరీతంగా పెరగడంతోపాటు, ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగుపడడం, ఇంగ్లీష్ మీడియం బోధన, ఏఐ, డిజిటల్ పాఠాలు అందుబాటులోకి రావడం, టీచర్ల బోధన పట్ల విశ్వాసం పెరగడమే ఈ సానుకూల మార్పునకు ప్రధాన కారణమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలతో ప్రభుత్వ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించేందుకు పేరెంట్స్ ఆసక్తి చూపుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్ల నుంచి సర్కారు బడులకు మారిన విద్యార్థుల సంఖ్య శుక్రవారం నాటికి 1,00,174కి చేరుకుంది. అంటే సరిగ్గా లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల వైపు మళ్లారు. దీనికి భిన్నంగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటుకు వెళ్లిన విద్యార్థులు కేవలం 10,490 మంది మాత్రమే ఉండడం విశేషం. ప్రైవేట్ నుంచి సర్కారుకు వచ్చే వారి సంఖ్యతో పోలిస్తే.. బయటకు వెళ్లే వారు కేవలం 10 శాతమే ఉండటం ప్రభుత్వ బడులపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనమని అధికారులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. ప్రైవేట్ స్కూళ్ల నుంచి సర్కారు బడుల్లో చేరుతున్న వారిలో నిజామాబాద్ జిల్లా ముందు వరుసలో నిలిచింది. ఇక్కడ అత్యధికంగా 8,461 మంది విద్యార్థులు ప్రైవేటును వదిలి ప్రభుత్వ స్కూళ్లలో చేరగా, ఆ తర్వాతి స్థానాల్లో జగిత్యాల 6,010 మంది, రంగారెడ్డి 5,524, కామారెడ్డి 5,284, నల్గొండ 4,919 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర రాజధాని ప్రాంతాలైన హైదరాబాద్ 2,527, మేడ్చల్ మల్కాజిగిరి 3,538 జిల్లాల్లో కూడా గణనీయమైన మార్పు కనిపించింది. అత్యల్పంగా ములుగు జిల్లాలో 566 మంది మాత్రమే సర్కారు బడిబాట పట్టారు. మరోపక్క సర్కారు నుంచి ప్రైవేటు బడుల్లో చేరిన వారిలో ఖమ్మం జిల్లా 868 మంది టాప్‌లో ఉంది. ట్యూషన్‌లో గొడవ.. క్రికెట్ బ్యాట్లతో విద్యార్థినిలపై దాడిప్రైవేటు బడుల్లో ఆకాశాన్నంటుతున్న ఫీజులు, డొనేషన్ల భారం మధ్యతరగతి, పేద వర్గాలకు శాపంగా మారాయి. అదే సమయంలో ప్రభుత్వ బడుల్లో పెరుగుతున్న మౌలిక వసతులు, ఇంగ్లిష్ మీడియం బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటు మధ్యాహ్న భోజనంలాంటి సౌకర్యాలు తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటితో పాటు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, వెల్‌కమ్ కిట్, ఏఐ, డిజిటల్ పాఠాలు పేరెంట్స్ ఆలోచనలను పూర్తిగా ప్రైవేటు నుంచి సర్కారు వైపు మళ్లించాయి. సర్కారు బడుల్లో చదివితేనే పిల్లల విద్యా ఫౌండేషన్ బలంగా ఉంటుందనే అభిప్రాయం బలపడుతోందని ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు పటిష్టమవుతాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

# నిట్‌కు ఎదురుగా అకడమిక్ బ్లాక్




**హనుమకొండ:** ప్రతి ష్ఠాత్మకమైన వరంగల్ నిట్ విద్యార్థుల అవసరా లకు అనుగుణంగా సౌకర్యాలను క్రమంగా విస్తరిస్తోంది. నిట్ ఔన్నత్యం ప్రతిబింబించేలా ప్రవేశ ముఖ ద్వారాన్ని నిర్మిస్తున్నది తెలిసిందే. దీనితో పాటు మరి కొన్ని నిర్మాణాలను కూడా త్వరలో చేపట్టబోతున్నది. వీటికి కేంద్రం నుంచి అనుమ తి కూడా లభించినట్టు తెలిసింది. ఇందులో ఒకటి అకడమిక్ బ్లాక్ కాగా, రెండోది రీసెర్చ్ ప్రాజెక్టు సెంటర్. నిట్ ప్రవేశ ముఖ ద్వారాన్ని రూ. 3కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. సెంట్రల్ పబ్లిక్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో హైదరాబా ద్‌కు చెందిన ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ పనిని చేపట్టిం ది. ఆరు నెలల్లో దీనిని పూర్తి చేస్తారు. ఈ ముఖ ద్వారాన్ని హనుమకొండకు చెందిన వాయిడ్ అర్కిటెక్ట్స్ సంస్థ ప్రతినిధి రాజేశ్ డిజైన్ చేశారు. నిట్ ఉన్నతాధికారులు, సీపీడబ్ల్యు ఇంజనీర్లతో పలు సార్లు సమావేశమై దీనిని సుదీర్ఘంగా చర్చించిన తర్వాత డిజైన్‌కు తుదిరూపం ఇచ్చారు. వరంగల్ నిట్ దేశంలో అత్యున్నత సాంకేతిక కళాశాలల్లో ఒకటి. కళాశాల ఔన్నత్యం ప్రతిబిం బించేలా, భవిష్యత్తులో కళాశాల విస్తరణతో పెరిగే అవసరాలు, విలువలు, విద్యా ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని ఒక అద్వితీయమైన శాశ్వత కట్టడంగా దీన్ని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ప్రవేశ ద్వారంగా ఉన్న కాకతీయ కళాతోరణం మధ్యలో 8అడుగుల ఎత్తైన ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ప్రతిష్టిస్తారు. కళాతోరణానికి ఇరువైపుల రెండు భారీ గేట్లతోపాటు ఇరువైపులా సెక్యూరిటీ రూమ్‌లు, టాయిలెట్లు నిర్మిస్తారు. కళాశాలలో ప్రస్తుతం పార్కింగ్ సౌకర్యం లేదు. ఈలోటు తీర్చడానికి కళాశాల లోపల కలాం గెస్ట్‌హౌస్‌కు ఎదురుగా ఎడమవైపు పార్కింగ్ కోసం ప్రత్యేకంగా విశాలమైన షెడ్డును నిర్మిస్తారు.

# తెలంగాణకు రెయిన్ అలర్ట్.



**హైదరాబాద్ :** తెలంగాణలో చాలా రోజుల తర్వాత వర్షాకాలం ఫీల్ కలుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గత రెండ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఆసిఫాబాద్, జగిత్యాల జిల్లాల్లో రాత్రి వేళల్లో కుండపోత వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నమోదు కానంతగా వర్షపాతం నమోదు కావడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో అత్యధికంగా 124 మి.మీ, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 109.5 మి.మీ వర్షపాతం రికార్డైంది. కాగా, రానున్న 24 గంటలు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రోజంతా ముసురు పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. రాబోయే మూడు గంటల్లో సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి , ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే మెదక్, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో తేలికపాటి మెదక్, సిద్దిపేట, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోనూ అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు పడవచ్చునని అంచనా వేస్తున్నారు.

# తెలంగాణపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. పెరగనున్న ఉష్ణోగ్రతలు, రానున్న తాగునీటి కష్టాలు



**హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై ఎక్కువగా ఉండనుందని, ఇప్పటికే నెలకొన్న లోటు వర్ష పాతం దీనికి అద్దం పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వర్షాకాలమే కాకుండా మరికొన్ని నెలలపాటు దీని ప్రభావం కొనసాగనుందని అంటున్నారు. ఈ మేరకు ఇన్‌కాయిస్, ఐఎండీ-పుణె సంస్థలు ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన నివేదికల్లో పలు కీలక వివరాలను వెల్లడించాయి. సెప్టెంబరుతో వానాకాలం ముగిసినప్పటికీ వచ్చే ఏడాది మార్చి నెల వరకు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఇన్‌కాయిస్ స్పష్టం చేసింది. తాజా అంచనాల ప్రకారం అక్టోబరు, డిసెంబరు మాసాల్లో ఇది మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఎల్‌నినో కారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని చెప్పారు. ఫలితంగా విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. మరోవైపు సాగు, తాగునీటి లోటు ఏర్పడి పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఇది రైతులను ఆర్థికంగా నష్టపరిచే ప్రమాదం ఉండగా.. రైతు కూలీల ఆదాయం కూడా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముప్పును ముందస్తుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా సూక్ష్మసేద్యం ద్వారా నీటిని పొదుపు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 2026-27 సంవత్సరంలో 2,38,750 ఎకరాల భూమిలో బిందుసేద్యం ఏర్పాటు చేసేందుకు రూ.498 కోట్లను వెచ్చించేలా సమగ్ర ప్రణాళికను రూపొందించింది. ఉద్యానశాఖ ద్వారా ఇప్పటికే ఆర్థికశాఖకు నిధుల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారు. ఈ రాయితీ పథకం కింద ఆయిల్‌పామ్, కూరగాయలు, మిర్చి, మక్కలు, కంది, పసుపు, సుగంధ ద్రవ్యాలు, ఉద్యాన, గులాబీ, మల్బరీ, మల్లె తోటల సాగుకు బిందు, తుంపర సేద్య పరికరాలను అందజేస్తారు. ఈ రాయితీలు వర్గాల వారీగా వర్తింపజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం మేర రాయితీని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. నేడు పలు జిల్లాల్లో వర్షాలు. ఇదిలా ఉండగా నేడు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షాలు కురుస్తాయని చెప్పారు. మిగిలిన జిల్లాల్లో పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించారు.